
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
ఆదివారం 13 జూలై 2025

ఇక లెక్క పక్కాగా..

- ఖరీఫ్ సాగులో డిజిటల్ సర్వేకు రంగం సిద్ధం
- తప్పులకు ఆస్కారం ఉండదు



కర్నూలు అగ్రికల్చర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఏ పంటలు సాగు చేస్తారో అదే పంటను రికార్డుల్లో చూపేందుకు వినూత్న రీతిలో ఈసారి డిజిటల్ క్రాప్ సర్వేను వ్యవసాయ శాఖ యంత్రాంగం చేపట్టేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ నెల రెండో వారం నుంచి రైతులు తమ పొలాల్లో కచ్చితంగా ఏ పంటను సాగు చేశారో పూర్తిస్థాయిలో పక్కాగా రికార్డుల్లో నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ సర్వే మొదలెట్టేందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు మార్గదర్శకాలు విడుదల చేశారు.

మార్గ దర్శకాలు ఇవే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 6.25లక్షల హెక్టార్లలో ప్రధాన పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గతంలో ఈక్రాప్, ఈకేవైసీ వంటి పద్ధతుల్లో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసేవారు. ఈ విధానాలతో చాలా తప్పులు చోటు చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. బ్యాంకుల్లో ఒక పంట సాగు చేస్తున్నట్లు రుణం తీసుకుంటే వ్యవసాయ శాఖ యంత్రాంగం చేపట్టిన సర్వేలో మరో పంట సాగు చేసినట్లు రికార్డుల్లో నమోదు అయ్యేది. దీంతో రైతులు పంటల బీమా పథకంతో పాటు పంట నష్టపరిహారాన్ని పొందేందుకు అర్హతను కోల్పోవాల్సి వచ్చింది. ఇకపై అటువంటి తప్పులు దొర్లకుండా ఈసారి ఖరీఫ్ డిజిటల్ క్రాప్ సర్వే వినూత్న రీతిలో చేపట్టేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా పంట సాగును లెక్కించేందుకు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం సమాయత్తం అవుతుంది.

ప్రభుత్వం నుంచి బీమా

ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వం నుంచి బీమా పొందాలంటే ఈ-పంటే నమోదే కీలకం. భూయజమానికి బీమా పక్కాగా డిజిటల్ సర్వే ద్వారానే వర్తించేందుకు ఈసారి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అదే సమయంలో పొలం యజమాని తన పొలాన్ని లీజుకు ఇస్తే సీసీఆర్ కార్డులు పొందిన కౌలు రైతులు నష్టపరిహారాన్ని పొందే అవకాశం ఉంటుంది.





అనుకూలమైన వాటి వివరాలు..

సాగుకు యోగ్యం కాని వ్యవసాయేతర, ప్రభుత్వ భూములను తొలగించి అనుకూలమైన వాటి వివరాలు నమోదు చేయనున్నారు. ప్రస్తుత వర్గీకరణలతో పాటు ఐదేళ్లుగా పంట వేయని బీడు భూముల వర్గీకరణ అమలులోకి తీసుకువచ్చారు. పొలం గట్ల మీద ఉండే వివిధ రకాల చెట్లు, సాగు చేసిన పంటను కొత్తగా చేపట్టనున్న సర్వేలో చేర్చారు. వ్యవసాయ పంటలు ఎంఏవో, ఉద్యాన పంటలు హెచ్‌వో, సాగుకు యోగ్యం కాని ప్రభుత్వ భూములను ఈసారి తహసీల్దార్ పరిశీలించాల్సి ఉంటుంది. వీరు తిరస్కరించిన భూములకు సంబంధించి సరైన కారణాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. తిరస్కరణకు గురైన వాటిని రైతు సేవా కేంద్రం సిబ్బంది తిరిగి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. రీసర్వే చేసిన రికార్డులు వ్యవసాయ శాఖ ఏడీఏ, డీహెచ్‌వో ఆమోదించాల్సి ఉంటుంది. అభ్యంతరకర భూముల్లో జాయింట్ కలెక్టర్ అనుమతితో సర్వే చేయాల్సి ఉంటుంది. భూమి యజమానితో పాటు కౌలు రైతుకు చెందిన వివరాలు తప్పనిసరిగా కొత్త విధానంలో డిజిటల్ సర్వేలో నమోదు చేయనున్నారు.

ప్రతి పంటను నమోదు చేస్తాం

నిబంధనలు అనుసరించి ఈ-పంట డిజిటల్ సర్వే నిర్వహించి ప్రతి పంటను నమోదు చేస్తాం. పంటల విస్తీర్ణంలో తేడాలు, ఒక రకం పంటను వేస్తే ఇంకో రకంగా రికార్డు చేయడం వంటి తప్పులు జరగవు. ఏ మాత్రం అలసత్వం వచ్చినా సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం.

● వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ, కర్నూలు


ఎరువుల కొరతపై రైతుల్లో ఆందోళన

- జాయింట్ కలెక్టర్ నవ్య సీరియస్
- రైతులకు అవగాహన కల్పించాలని, డీలర్లపై చర్యలు తీసుకోవాలని జేడీకీ ఆదేశాలు



కర్నూలు అగ్రికల్చర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముందస్తు వర్షాల కారణంగా రైతులు ప్రధాన పంటలు పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. జూలైలో కూడా రైతులు విత్తనాలు వేసే కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో యూరియా, డీఏపీ తదితర ఎరువుల కోసం రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద సహకార సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాల వద్ద బారులు తీరినా ఒక్క సంచి కూడా దొరకడం లేదు. పది రోజుల నుంచి ఎరువుల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మరో వైపు మార్క్‌ఫెడ్ ద్వారా డీసీఎంఎస్, సహకార కేంద్రాలకు అందుతున్న ఎరువులు నిమిషాల్లో గ్రామాల్లోనే పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు, వారి అనుచరులే ఎగురేసుకుపోతుండటంతో వ్యవసాయ శాఖ యంత్రాంగంపై రైతులు పెద్ద ఎత్తున ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులను గుర్తించిన జాయింట్ కలెక్టర్ నవ్య శనివారం వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మిని తన చాంబరుకు పిలిపించుకుని ఎరువుల వినియోగంలో రైతులకు అవగాహన కల్పించాలని, ఏ ఎరువులు ఎంత మోతాదులో నిల్వ ఉన్నాయో తదితర విషయాలన్నీ రైతులకు తెలియజెప్పాలని ఆదేశించారు. దీంతో జేడీ వరలక్ష్మి హుటాహుటిన పత్రికా ప్రకటన విడుదల చేశారు. శనివారం నాటికి జిల్లాలో యూరియా 8,330 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1967 టన్నులు, ఎంవోపీ 1095 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 12,793 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 655 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 2,654 మెట్రిక్ టన్నుల యూరియా, డీలర్ల వద్ద 3,046 మెట్రిక్ టన్నులు, కంపెనీల గోదాముల్లో 681 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ దుకాణాల వద్ద 1,949 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

ఒక్క గేటు ద్వారా నీరు విడుదల



శ్రీశైలం డ్యామ్ నుంచి ఒక్క గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో శనివారం ఉదయం రెండు గేట్లను మూసివేసి ఒక్క గేటు ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 27,157 క్యూసెక్కులు, కుడి, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 68,377 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,39,297 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుకుంటోంది. శనివారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయ నీటిమట్టం 883 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టును వీక్షించేందుకు తరలివచ్చిన సందర్శకులతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో ఆ దృశ్యాలను వీక్షించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో శ్రీశైలం చేరుకున్నారు.

తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకువద్దాం

- విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు
- ఘనంగా రాష్ట్ర తెలుగు భాషా పరిరక్షణ సదస్సు ప్రారంభం



సదస్సును జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న కేసీ కల్కూర, జేఎస్ఆర్‌కే శర్మ, పత్తి ఓబులయ్య తదితరులు

వివరాలు 6లో

హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి

- రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ ఆలీఖాన్

కర్నూలు అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్ర-2026 వెళ్లాలనుకునే ముస్లింలు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ ఆలీఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారి పాస్‌పోర్టు 2026 డిసెంబరు 31 వరకు చెల్లుబాటు అవ్వాల్సి ఉంటుందని వివరించారు. యాత్రికులందరూ విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను తమ తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడికి కూటమి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. యాత్రికులు రాష్ట్రానికి కేటాయించిన పూర్తి కోటాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



దర్శనానికి వేచి ఉన్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో మల్లన్న దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండో శనివారం సెలవు రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందించారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలుచేస్తే పోరాటాలే

- ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఎరుపెక్కిన పోరాటాల గడ్డ పత్తికొండ

పత్తికొండటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని దివాలా తీయాలని చూస్తే పోరాటాలు తప్పవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని సీపీఐ నియోజకవర్గ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడారు. ఎన్నికల వేళ అనేక హామీలను గుప్పించారని, అధికారంలోకి వచ్చి ఏడాది ముగియగా ఏమి అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పులు తెచ్చి సంక్షేమానికి ఖర్చు పెడుతున్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి, శ్రీలంకగా మారుస్తాడంటూ ఎద్దేవా చేశారన్నారు. మీరు అధికారంలో ఉండి ఏమి ఉద్ధరించారో సమాధానం చెప్పాలన్నారు. అదానీ లాంటి ధనవంతులకు ఖజానాను కట్టబెట్టేందుకే పాలకులు పన్నాగం పన్నుతున్నారన్నారు. ప్రతి హామీని నెరవేర్చాల్సిందేనని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న పాలకులు ప్రజా సంక్షేమాన్ని, రైతు సంక్షేమాన్ని మరిచారన్నారు. కర్నూలు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఈ జిల్లానే సస్యశ్యామలం అవుతుందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షతన జరిగిన ఈసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేఖర్, లెనిన్‌బాబు, జిల్లా కార్యదర్శి సభ్యులు నబీరసూల్, రంగన్న, విరుపాక్షి, కారుమంచి, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఎర్రసైన్యం

సీపీఐ నియోజకవర్గ మహాసభల సందర్భంగా ఎర్రదండు సైన్యంతో పోరాటాల గడ్డ పత్తికొండ ఎరుపెక్కింది. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి వేలాది మంది కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రదర్శన అగ్రభాగాన డప్పుల శబ్దానికి గొరవయ్యల, లంబాడీల, చిన్నారుల కోలాటాల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వందలాది మంది మహిళలు ఎర్రచీరలు ధరించి ఎర్రజెండాలు పట్టుకుని కదిలివచ్చారు. ప్రజానాట్యమండలి ఆలపించిన విప్లవగేయాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చివరి ఆయకట్టు వరకు నీళ్లు

- ఖరీఫ్‌లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు
- ఐఏబీ సమావేశంలో ప్రజాప్రతినిధులు



సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, తెలుగుగంగ వంటి ప్రధాన కాలువలతో పాటు జిల్లాలోని అన్ని కాలవలకు శనివారం అర్ధరాత్రి నుంచే నీటిని విడుదల చేస్తామని, ఖరీఫ్‌కు సంబంధించి ఈ ఏడాది ప్రతి చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఐఏబీ సమావేశంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాలు మౌలిక సదుపాయలు, పెట్టుబడులశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు గౌరుచరితా రెడ్డి, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య హాజరయ్యారు. మంత్రులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి నుంచి అన్ని ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేస్తామన్నారు. సాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, నీటిని వృథా చేయవద్దని రైతులకు సూచించారు. జిల్లాలో ప్రతి రైతు వరి సాగు చేయడంతో సమస్యలు వస్తున్నాయని, సీజన్ పంటలపై దృషి సారించాలని సూచించారు. 15ఏళ్ల చరిత్రలో లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు 20 రోజులు ముందుగానే నీటిని విడుదల చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నీటిపారుదలశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డలో కేసీ కెనాల్ కాల్వలను మీద వెంచర్ వేసిన వారిపై ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో లస్కర్ల కొరత వల్ల రైతులకు సక్రమంగా నీళ్లు చేరడం లేదని, వెంటనే లస్కర్ల పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పులివెందులకు నీళ్లు తీసుకెళ్లిన ఘనత సీఎం చంద్రబాబుదే: మంత్రి బీసీ

గాలేరు నగరి సుజల స్రవంతి ద్వారా పులివెందులకు కూడా నీళ్లు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో ప్రారంభిస్తే గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.300 కోట్ల నిధులు ఖర్చు చేయడంతో నేడు ఆ రిజర్వాయర్ ద్వారా కడప, నంద్యాల జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఆయకట్టుకు నీరు అందిస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతోనే అవుకు రిజర్వాయర్‌కు కూడా నీళ్లు తెచ్చామన్నారు. పులివెందులకు కూడా గాలేరు, నగరి సుజలస్రవంతి ప్రాజెక్టులో దశాబ్ద కాలంగా కాలువలు తవ్వి వదిలిపెడితే, సమస్యలన్నింటినీ అధిగమించి అవుకు ప్రాజెక్టుకు నీళ్లు నింపిన ఘతన టీడీపీ ప్రభుత్వానిదే అన్నారు. గత ప్రభుత్వం అలగనూరు ప్రాజెక్టుకు కనీసం రూ.3కోట్లు ఖర్చు చేయకుండా వదిలేశారని చెప్పారు.

మిగతా 6వ పేజీలో



హాజరైన అధికారులు

పుణ్య స్నానాలకు వెళ్లి.. గల్లంతు

- తుంగభద్ర నదిలో ముగ్గురు గల్లంతు
- ప్రాణాలతో బయట పడిన నలుగురు యువకులు
- వీరంతా డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులే

7




నదిలో పుట్టీలతో గాలింపు చేస్తున్న ఎస్ఐ

తుంగభద్ర తీరం
సాహిత్యం



శాస్త్రీయ ఆలోచనా విధానానికి
దర్పణమే హేతువాదం


హేతువాదం
వ్యక్తిగత మరియు సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందా?
WILL RATIONALISM CONTRIBUTE FOR THE DEVELOPMENT OF THE SOCIETY AND INDIVIDUAL?
జె.వి.క్రిష్ణయ్య M.Sc.,M.Ed.,B.L.

కర్నూలు కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'అసతోమా సద్గమయ...తమసోమా జ్యోతిర్గమయ' అని కఠోపనిషత్తు చెబుతుంది. అంటే చెడు నుంచీ మంచివైపునకు, అజ్ఞానం నుంచీ జ్ఞానం వైపునకు వెళ్లడం మానవ లక్షణం. అదే విధంగా సమాజం, మతం అనే చీకటి నుంచీ హేతువాదం అనబడే జ్ఞానం వైపు ఆలోచిస్తేనే ఉత్తమ సమాజం ఏర్పడుతుంది. అంతకు మించింది ఏదీ లేదని, శాస్త్రీయ ఆలోచనా విధానంలో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని 'హేతువాదం' పుస్తకం ఉద్బోధిస్తుంది. అందుకే ఈ పుస్తకం ముఖచిత్రంలోనే రచయిత హేతువాదం వ్యక్తిగత సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందా..? అంటూ ప్రశ్నిస్తూనే 300 పేజీలకు పైచిలుకుగల ఈ పుస్తకాన్ని ముందుకు తీసుకువచ్చారు.


జేవీ క్రిష్ణయ్య

ఈ పుస్తకంలో ప్రముఖ వైద్యుడు, విజయవాడ నాస్తిక కేంద్రం నిర్వాహకులైన డాక్టర్ జి.సమరం ముందు మాట రాశారు. 'హేతువాదం అంటేనే ప్రశ్నించడం, పరిశీలించడం, పరీక్షించడం, ఆపైన సత్యాన్ని రాబట్టడం, దానిని అనుసరించడం. అంతేకానీ అస్తికత్వంలోలా గుడ్డిగా నమ్మడం, అనుసరించడం కాదు' అని చెబుతారు. వృత్తిరీత్యా అధ్యాపకుడైన రచయిత జె.వి.కృష్ణయ్య ప్రశ్న సంధించడం, సమాధానం రాబట్టడం, సమాధానం సరైనది కాకపోతే సరిదిద్దడం, అపైన ఆ సమాధానం ఎందుకు సరికాదో, తాను చెప్పింది ఎలా సబబో వివరించడం ఆ పుస్తకం మొత్తంగా కనిపిస్తుంది. అందుకే రచయిత ఈ పుస్తకం ప్రారంభంలోనే హేతువాదం అంటే 'శాస్త్రీయ ఆలోచనా విధానం', 'సక్రమమైన మానసిక వైఖరి' అని నిర్వచించారు. అంతేకాకుండా హేతువాదం ఒక నిర్మాణాత్మక జీవన విధానం అని కూడా చెప్పుకొచ్చారు. హేతువాదం గురించి ఏమాత్రం సందిగ్ధత లేకుండా ప్రశ్నించడం అని కూడా పేర్కొన్నారు. ఈ ప్రశ్నించే విధానం వివిధ రూపాల్లో ఈ పుస్తకంలో వివరంగా రాశారు. హేతువాదం ముఖ్య ఉద్దేశ్యాలను స్పష్టంగా, సవివరంగా పొందు పరిచారు. ఈ పుస్తకం తన అనుభవాలు, ఇతరుల పరిశీలన, వివిధ సంఘటనల నుంచి నిజాలను వెల్లడించడం, అబద్ధాలను బట్టబయలు చేయడం సామాన్య పాఠకునికి హేతువాదం గురించి ఎంతో ఆసక్తిని కలిగించేలా రాశారు. అలాగే ఈ పుస్తకాన్ని చదివిన ప్రముఖ రచయిత డాక్టర్ కత్తి పద్మారావు కూడా తన అభిప్రాయాన్ని ఇందులో పొందుపరిచారు. రచయిత జె.వి. కృష్ణయ్యను ఆయన హేతువాద, లౌకిక వాద, సామ్యవాద, భావజాలం గల మేధావిగా వర్ణించారు. ఉమ్మడి జిల్లాలోని గోస్పాడు మండల కేంద్రంలో 1957 మే 14న జన్మించిన రచయిత జె.వి. కృష్ణయ్య ఎం.ఎడ్, బీఎల్ పూర్తి చేశారు. ఏపీఆర్‌జేసీ కళాశాల అధ్యాపకునిగా పనిచేస్తూ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది పదవీ విరమణ చేశారు. ప్రవృత్తి పరంగా మూఢ, అంధ విశ్వాసాలను రూపుమాపేందుకు కృషి చేస్తున్నారు. హేతువాద, నాస్తిక వాద భావజాలంతో సమకాలీన సామాజిక సమస్యలపై భావస్వారూప్య సంఘాలతో కలిసి పనిచేస్తున్నారు. ప్రస్తుతం మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

- ఎస్సార్. మందిరాజు, కర్నూలు

చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు

(5వ పేజీ తరువాయి)

సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయల సీమకు తీసుకరావడానికి ప్రయత్నిస్తుంటే రాజకీయం కోసం విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాజకీయ నాయకులు చేస్తున్న విమర్శలపై వైసీపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. త్వరలో బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రమంత్రిని కలిసి ప్రాజెక్టు ఆవశ్యకతను తెలియజేస్తామన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ కట్టలు ఎప్పటికప్పుడు తెగుతున్న క్రమంలో శాస్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల మంతా గుండ్రేవుల ప్రాజెక్టు కోసం తీర్మానం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఐఏబీ సమావేశంలో తీర్మానాలివీ..

- కృష్ణా జలాల పంపిణీ ట్రిబ్యునల్ ప్రకారం కేటాయించిన 31.90 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు తగిన జలాశయం లేకపోవడంతో 2019లో శంకుస్థాపన చేసిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో చర్చించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రతిపాదించారు.
- తెలుగుగంగ పథకం, కేసీ కాలువ కింద రైతాంగం సాగునీటి అవసరాల దృష్ట్యా 2026 జనవరి 31 వరకు 12 టీఎంసీల నీటిని వెలుగోడు జలాశయంలో నిల్వ చేయాలని తీర్మానించారు.
- అలగనూరు జలాశయ మరమ్మతులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని, రాబోయే బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.
- కేసీ కాలువకు 13వ తేదీ నుంచి, తెలుగుగంగ కాలువకు 12వ తేదీ అర్ధరాత్రి నుంచి, ఎస్సార్బీసీ కాలువకు 12వతేదీ అర్ధరాత్రి నుంచి, హంద్రీ నీవా కాలువకు 15వ తేదీ నుంచి నీటిని విడుదల చేయాలని తీర్మానించారు.

మధుర సాహితీమూర్తి ఎలమర్తి

- తెలుగు సాహితీ క్షేత్రంలో అక్షర కృషీవలుడు
- జిల్లాలో మధుర కవిగా ప్రత్యేక గుర్తింపు
- 45 ఏళ్లుగా సాహిత్య ప్రస్థానం
- ఎస్పీ బాలుతో ప్రశంసలు


రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం అందుకుంటూ..


ఎలమర్తి రమణయ్య

కర్నూలు కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసినా, ప్రవృత్తి రీత్యా సాహితీ రంగానికి విరమణ లేదని చాటి చెబుతున్నారు ఈ మధుర కవి. సుసంపన్నమైన తెలుగు భాషకు పట్టం కడుతూ 45 ఏళ్లుగా సాహిత్య ప్రస్థానం సాగిస్తున్నారు కర్నూలుకు చెందిన ఎలమర్తి రమణయ్య. 'మధుర కవి' పేరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన తెలుగు సాహితీక్షేత్రంలో అక్షర కృషీవలుడిగా రాణిస్తున్నారు. 'సీమ సింహద్వారా.. శ్రీశైల ముఖద్వారం..' అంటూ కందన వోలుపై ఆయన రాసిన గీతిక గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్వరం నుంచి జాలువారి ప్రేక్షక నీరాజనాలు అందుకుంది. అదీ కందనవోలులో జరిగిన ఒక కార్యక్రమంలోనే కావడం విశేషం. 'రాయలు ఏలిన సీమ.. ఇది రతనాల సీమ' అనే మరో పాట సినీ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ గోతుల్లో ఒదిగిపోయి, మాతృగడ్డ మమకారాన్ని చాటి చెప్పింది. కథ, కథానిక, కవిత, పాట, పద్యం, వ్యాసం ఏ సాహితీ ప్రక్రియ అయినా ఆయన కలంలో భావ వీచికలతో అలరిస్తుంది. అంతేకాదు, తెలుగు భాషా వికాస ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ భాషా పరిరక్షణకు తనదైన ఉద్యమ ప్రస్థానం కూడా సాగిస్తున్నారు.

తండ్రి స్ఫూర్తితో కళా, సాహిత్యంలో రాణింపు

ఎలమర్తి రమణయ్య 1956 జూలై 1వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు దివంగత అయ్యమ్మ, వై. నాగభూషణం. తండ్రి ప్రముఖ హార్మోనిస్టు, ఫ్లూట్ ఆర్టిస్టు. ఆయనది నందికొట్కూరు ప్రాంతం. అయినా 50వ దశకంలో అనేక నాటకాలకు హార్మోనిస్టుగా పనిచేస్తూ ఆనాటి ప్రఖ్యాత నాటక రంగ మహామహులు గూడూరు సావిత్రి, సురభి బాలసరస్వతి, బుర్రా సుబ్రహ్మణ్యం, ఆచంట వెంకటరత్నం నాయుడు, ఈలపాటి రఘురామయ్య వంటి వారితోపాటూ జిల్లాలోని వెల్దుర్తి వెంకటనర్సు నాయుడు తదితర కళాకారులతో నాటకాలు వేయించేవారు. అలా తండ్రి నాటక పద్యాలకు రాగాలను కూర్చి పాడిస్తుంటే అవి వింటూ పెరిగాడు. తండ్రి వెంట తిరుగుతూ నాటకం, సాహిత్యంపై ఎల్లమర్తి మమకారం పెంచుకున్నారు. తండ్రి మరణంతో వాటికి దూరం కావాల్సి వచ్చింది. తల్లి ప్రోత్సాహంతో చదువుపై ఆసక్తితో ముందుకు పోయారు. అలా బీఏ, బీఎడ్ పూర్తి చేశారు. 1978 నుంచి 1989 వరకు రాయలసీమ పేపర్ మిల్లులో ఆఫీస్ అసిస్టెంట్‌గా, అనంతరం బిజినెస్ మేనేజర్‌గా పనిచేశారు.

ఆకాశవాణి కార్యక్రమాలు..

అప్పట్లో కడప ఆకాశవాణి కేంద్రం వారు కార్మికుల కార్యక్రమం నిర్వహిస్తూ కార్మికులకు సంబంధించిన అనేక విషయాలను ఆసక్తిగా తెలియజేసేవారు. పేపర్ మిల్లులో పనిచేస్తూ ఎలమర్తి అనేక వ్యాసాలు రాసి వాటి ద్వారా ప్రశంసలు అందుకున్నారు. ఆకాశవాణి అధికారులు స్వయంగా మాట్లాడిస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సాహం అందించారు. అదే స్ఫూర్తితో అనేక కథలు, కథానికలు, నాటకాలు రాసి వాటి ప్రసారం ద్వారా ప్రశంసలు అందుకున్నారు.

మలుపుతిప్పిన ఉపాధ్యాయ జీవితం..

పేపర్ మిల్లు కొన్నికారణాలతో 1989లో మూతపడ్డాక మళ్లీ కొత్త జీవితాన్ని వెతుక్కోవలసి వచ్చింది. అలా ఒక ప్రైవేటు పాఠశాల్లో పనిచేస్తూనే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 1990లో మున్సిపల్ హైస్కూల్ బండిమెట్టలో తన ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించారు. భావి పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను నిర్వర్తిస్తూనే తన కలానికి పదును పెట్టారు. మాతృభాషపై మమకారం తరిగిపోతున్న నేటికాలంలో ఆయన ఇరవై ఏళ్ల క్రితమే ఉద్యమం చేపట్టారు. తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థలో చేరి జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. 'కమ్మనైన తెలుగు భాష కలనైనా మరువద్దు.. అమ్మపాల కమ్మదనం, మాతృభాష మరువద్దు' అనే ఉద్యమ గీతంతో రాష్ట్ర వ్యాప్తంగా పేరుతెచ్చుకున్నారు. తెలుగు భాష పునరుజ్జీవానికి ఉద్యమ గీతాలు రాస్తున్నారు. జేవీవీలో పనిచేస్తూ అనేక ఉద్యమ గీతాలు రాసి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు.





ఎలమర్తి రాసిన పుస్తకాలు

రచనలు ఎన్నో.. పురస్కారాలు మరెన్నో


రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటూ..

మధుర కవి ఎలమర్తి అనేక పుస్తకాలు రాశారు. తెలుగు భాషను సుసం పన్నం చేస్తూ అనేక పద్యగీతాలు రాశారు. కర్నూలు ప్రశస్తి, కర్నూలు వైభవం, తామ్రధ్వజ విజయం, పర్యావరణ గీతావళి, పొదుపు లక్ష్మి కళా జాత (పద్యాలు), అక్షర వీక్షణం, ప్రతి చోటా నా పాట, లవకుశ చిత్ర పాటలపై సమీక్ష (పుస్తకం), పుష్కర కృష్ణవేణి, శివస్తుతి (కంద పద్యాలు) వంటివి రాశారు. అలాగే ఎస్పీ బాలు కర్నూలులో నిర్వహించిన 'పాడాలని ఉంది' కార్యక్రమానికి కర్నూలు వైభవంపై గీతం రాసి అందించి, ఆయనతో ప్రశంసలు అందుకున్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం, క్లస్టర్ యూనివర్సిటీలకు గీతాలు అందించారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2007లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. 2008లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో, 2017లో ఎన్టీఆర్ ట్రస్టుతో, టీడీపీ నేత చంద్రబాబుతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

పౌరాణికంలో ప్రతిభ

- పద్యాలతో అలరిస్తున్న మంత్రాలయం సుంకప్ప
- దుర్యోధనుడు, శ్రీకృష్ణుడు, వీరబాహుడు వంటి పాత్రల్లో రాణింపు
- పలువురి నుంచి ప్రశంసలు


దుర్యోధన వేషాధారణలో సుంకప్ప



మంత్రాలయం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో నాటక ప్రదర్శనల్లో పేరుగాంచిన సుంకప్ప పద్యం పాడితే వీక్షకులు ఈలలు, కేకలు వేయాల్సిందే. మంత్రాలయం పరిసర ప్రాంతాల్లో దుర్యోధనుడి పాత్రలో మెప్పించాలంటే వెంటనే గుర్తుకువచ్చే కళాకారుల్లో సుంకప్ప ప్రథముడు. 57 ఏళ్ల వయసులోనూ ఎన్నో పౌరాణిక నాట ప్రదర్శనలు ఇస్తూ ఔరా అనిపించుకుంటున్నాడు. 18 ఏళ్ల వయసులోనే బైలు ఆట, లీలావతి, రుక్మిణి అనే కన్నడ నాటక ప్రదర్శనతో ప్రవేశించి సామాజిక రక్త తిలకంలో హాస్యనటుడుగా నటనలో అందరి మన్ననలు పొందాడు. దుర్యోధనుడిగా మయసభ, పడకసీనులో తన బాణితో విశ్వరూపం ప్రదర్శించి ప్రశంసలు పొందాడు. సత్యహరిశ్చంద్రలో వీరబాహుడు, శ్రీకృష్ణ తులాభారంలో కృష్ణుడు, వీరబ్రహ్మంగారి చరిత్రలో పీర్‌సాబ్, కక్కయ్య వంటి పాత్రలను అవలీలగా పోషిస్తూ తన నటనకు తిరుగులేదని నిరూపించు కుంటున్నాడు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో సామాజిక, పౌరాణిక, కన్నడ భాషాల్లో రాణిస్తూ నటసామ్రాట్‌గా నిలిచాడు. రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో తన సొంత ఖర్చులతో పౌరాణికాన్ని మేలుకొలిపే విధంగా శ్రీగురు రాఘవేంద్ర నాటక కళాసమితిని ఏర్పాటు చేసి కోశాధికారిగా కొనసాగుతున్నాడు. ఈయనకు భార్య మంగమ్మ, ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. సాధారణ రైతు కూలీ కుటుంబంలో జన్మించి టెంకాయల వ్యాపారం, ట్యాక్సీ నడుపుతూ, లాడ్జీల నిర్వహణ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పౌరాణిక నాటకాలు ఎక్కడ ప్రదర్శనలు ఉంటే అక్కడ ఆయన ప్రత్యక్షమవుతాడు. కనుమరుగవుతున్న పౌరాణిక నాటకాలకు జీవం పోసేందుకు తన సొంత ఖర్చుతో సంగీతం మాస్టార్లను పోషిస్తూ తోటి కళాకారులకు సహకారాలు అందిస్తూ ముందుకు వెళ్తున్నాడు. మంత్రాలయం పూర్వ పీఠాధిపతులు సుశమీంద్రతీర్థులు, సుయతీంద్రతీర్థులు, ఇప్పటి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో పాటు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ప్రముఖ పౌరాణిక కళాకారిణి రత్నశ్రీతో అభినందనలు పొందారు.

కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి

కనుమరుగువతున్న పౌరాణిక నాటకాలకు ప్రభుత్వం ప్రోత్సహించి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. కళాకారులకు పించన్లు, ఇంటి స్థలాలు, కళాప్రాంగణాలు నిర్మించి భారతదేశ సంస్కృతి సంప్రదాయ ధర్మాలతో నిర్మిస్తున్న పౌరాణిక నాటకాలకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలన్నారు.

సుంకప్ప, మంత్రాలయం


సామాజిక నాటిక ప్రదర్శనలో ఓ సన్నివేశంలో సుంకప్ప

రాయచూరు టు తిరుపతి

- పర్యావరణ పరిరక్షణ కోసం..
- కర్ణాటక వాసుల సైకిల్ యాత్ర


ఆదోనికి చేరుకున్న కర్ణాటక సైకిల్ యాత్రికులు

ఆదోని రూరల్, జూలై 12 ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం రాయచూరుకు చెందిన రాజు, తిమ్మారెడ్డి, సునీల్ రాయచూరు నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర చేపట్టారు. శనివారం మధ్యాహ్నం ఆస్పరి బైపాస్‌లో మారెమ్మవ్వ దేవాలయం వద్ద సైకిల్ యాత్రికులు సేదతీరారు. ఉదయం 5గంటలకు రాయచూరులో బయల్దేరామని, 14వ తేదీన సాయంత్రానికి తిరుపతికి చేరుకుంటామని వారు తెలిపారు. ప్రతి ఏటా వర్షాకాలం ఆ రంభంలో రాయచూరు నుంచి తిరుపతికి సైకిల్‌పై వెళ్తామన్నారు. రోడ్డుకిరువైపులా చాలా ప్రాంతాల్లో పలురకాల మొక్కలను నాటుతామన్నారు. 12 సంవత్సరాలుగా తిరుపతికి సైకిల్‌లో వెళ్తున్నామన్నారు. 12ఏళ్ల క్రితం నాటిన చెట్లు ఇప్పుడు పెద్దవిగా అయ్యాయని, వాటిని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు.

మొదటి సారి..



మొదటి సారి సైకిల్‌పై అందరితో పాటు తిరుపతికి వెళ్తున్నా. ఎంతో ఆనందంగా ఉంది. సమయం కూడా కనిపించడం లేదు. రాయచూరులో కూడా కాలుష్య నివారణ కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టాను.

● సునీల్, రాయచూరు

12 ఏళ్ల క్రితం...



పన్నెండు సంవత్సరాల క్రితం రాయచూరు నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర ప్రారంభించా. కొత్తవాళ్లను కూడా సైకిల్ యాత్రకు ప్రోత్సహిస్తున్నా. అప్పుడు నాటిన మొక్కలు నేడు చెట్లు అయ్యాయి. వాటిని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది.

● రాజు, రాయచూరు

సైకిల్ తొక్కడంతో..



11 సంవత్సరాలుగా తిరుపతికి సైకిల్‌పై వెళ్తున్నా. నా వయస్సు 45 సంవత్సరాలు. సైకిల్ తొక్కడంతో ఎంతో ఆరోగ్యంగా ఉన్నా. అత్యావసర పరిస్థితుల్లో తప్ప వాహనాలను ఉపయోగించను.

● తిమ్మారెడ్డి, రాయచూరు

తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకువద్దాం

- విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు
- ఘనంగా రాష్ట్ర తెలుగు భాషా పరిరక్షణ సదస్సు ప్రారంభం
- నగరంలో భారీ ర్యాలీ
- వివిధ జిల్లాల నుంచి హాజరైన ప్రతినిధులు


విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకువద్దామని విశ్రాంత ఐఏఎస్ అధికారి నంది వెలుగు ముక్తేశ్వరరావు పేర్కొన్నారు. అధికార భాషగా, బోధనా భాషగా తెలుగును అమలు చేయడంతోపాటూ ప్రథమ భాషగా, మాతృభాషగా తగిన గుర్తింపు ఇవ్వాలని కోరుతూ రెండు రోజుల రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు శనివారం కర్నూలులో ఘనంగా ఆరంభమైంది. కొండారెడ్డి బురుజు సమీపంలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద భాషాభిమానులు, సాహితీవేత్తలు, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన సదస్సు ప్రతినిధులు, విద్యార్థులు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలుగు భాషను పరిరక్షించాలంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. తెలుగు తల్లి విగ్రహం నుంచి కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్ సర్కిల్, బుధవారపేట మీదుగా కలెక్టరేట్ ముందు గల మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు రచించిన 'అప్పుడు రాష్ట్రం కోసం...ఇప్పుడు భాష కోసం' అనే పుస్తకాన్ని సాహితీవేత్తలు ఆవిష్కరించారు. సదస్సు కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సదస్సులో మద్రాసు తెలుగు సంఘం అధ్యక్షుడు తూమాటి సంజీవరావు, నరసం జిల్లా అధ్యక్షురాలు కా.వెం.సుబ్బలక్ష్మమ్మ, డీఎస్పీ మహబూబ్ బాషా, ఎం. లక్ష్మయ్య ప్రసంగించారు. తొలిరోజు సదస్సు రెండో సెషన్‌లో వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన తెలుగు భాషా ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. తెలుగు భాషా పరిరక్షణ, ఉన్నతి, అమలు తదితర అంశాలపై తగిన సూచనలు చేశారు. ఈ అంశాలపై ఆదివారం జరిగే ముగింపు సదస్సులో మరోసారి చర్చించి, తీర్మానాలు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాలని సదస్సు బాధ్యులు నిర్ణయించారు. అంతకు ముందు సునీత వ్యాఖ్యానంతో నృత్య గురువు కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన నృత్య రూపకాలు, ఎలమర్తి రమణయ్య, జేఎస్ఆర్‌కే శర్మ, కళారత్న పత్తి ఓబులయ్య, గాయని సుజాత ఆలపించిన తెలుగు పద్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి.


తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

రేపటి తరాలకు అందించాలి..

తెలుగు గొప్పదనాన్ని రేపటి తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తల్లిదండ్రులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులపై ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు అన్నారు. గతమెంతో ఘనకీర్తి ఉన్న తెలుగు భాషను నేడు నిర్లక్ష్యం చేస్తున్నారని, మాతృభాషలో బోధన సాగితే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఈ సదస్సులో తెలుగు భాషను ఎలా కాపాడుకోవాలనే అంశంపై చర్చలు చేసి తీర్మానాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

చారిత్రక సదస్సులు నిలిచిపోవాలి : కేసీ కల్కూర

సభకు అధ్యక్షత వహించిన సదస్సు అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ రెండు రోజుల పాటూ కొనసాగే ఈ సదస్సు ఒక చారిత్రక సదస్సులా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. నాడు పొట్టి శ్రీరాములు త్యాగంతో భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే, అయితే 70 ఏళ్లు గడుస్తున్నా తెలుగు అధికారిక భాషగా లేకపోవడం బాధాకరమని చెప్పారు.

చింతామణి నాటకంపై నిషేధం ఎత్తివేయాలి : పత్తి ఓబులయ్య

కాళ్లకూరి నారాయణ రావు వందేళ్ల క్రితం రాసిన 'చింతామణి' నాటకాన్ని గత ప్రభుత్వం నిషేధించిందని, ఆ నిషేధాన్ని ఎత్తివేసేలా ప్రభుత్వం చూడాలని మరో అతిథి, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కోరారు. ప్రభుత్వం తెలుగు అకాడమీని పునఃప్రారంభించాలని, అధికార భాషా సంఘం ఏర్పాటు చేసి తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఎవరో కొందరు వాస్తవ కథను పక్కదారి పట్టించడం వల్ల ఒక వర్గానికి ఇబ్బంది కలిగిందని, రచయిత రాసిన విధంగా పుస్తకాన్ని యథావిధిగా ప్రదర్శిస్తే ఎవరికీ ఏ ఇబ్బంది ఉండబోదని చెప్పారు.

తెలుగు భాషకు జీవం పోస్తూ.. జేఎస్ఆర్‌కే శర్మ

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగు భాషకు జీవం పోస్తూ అనేక సంస్కరణలు చేశారని సదస్సు ఉపాధ్యక్షుడు జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ గుర్తు చేశారు. నేడు తెలుగు భాషకు పూర్వవైభవాన్ని కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.

విజేత అనంత

ముగిసిన మల్టీ డే క్రికెట్ పోటీలు


కమిల్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మల్టీ డే క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు గెలుపొందింది. నాలుగో రౌండ్ సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలు స్థానిక అనంత క్రీడాగ్రామంలో శనివారం ముగిశాయి. అనంతపురం, కర్నూలు జట్ల మధ్య పోటీ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 267 పరుగులకు ఆలౌట్ కాగా కర్నూలు 178పరుగులకే కుప్పకూలింది. 89 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం 293 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు 255 పరుగులకు ఆలౌట్ అయ్యి పరాజయం పాలైంది. అనంతపురానికి బౌలర్ కమిల్ 7 వికెట్లు పడగొట్టాడు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి విజేత జట్టును అభినందించారు.



ఆహ్లాదవనం

- మైమరిపించే జీవాకృతులు ● రాజసౌధం రూపంలో తోరణం ● మానసిక ఉపశమనం కోసం యోగా కేంద్రం
- మెరుగైన వసతులతో ఆధునికీకరణ



రాజసౌధం నమూనాలో శిలా తోరణం,

సహజసిద్ధమైన ప్రకృతి ఒడిలో ఆహ్లాదాన్ని పంచేలా పచ్చని చెట్లు, పచ్చిక మైదానాలు, సందర్శకులు మైమరిపించేలా ఆకర్షణీయమైన జీవాకృతులు, చిన్నారులను మురిపించేలా జంతు బొమ్మలతో ఆట వస్తువుల ఏర్పాటుతో 'విజయవనం' చూడముచ్చటగా ఏర్పాటైంది. నగర శివారు వెంగన్నబావి సమీపంలోని హంద్రీ నది పరివాహక ప్రాంతంలో దాదాపు 85ఎకరాల్లో విస్తరించింది. ఈ ప్రాంతం ఇటీవలి కాలంలో మెరుగైన వసతులతో ఆధునికీకరించబడింది. సందర్శకులకు ఆహ్వానం పలికేందుకు రాజసౌధం రూపంలో శిలా తోరణం, విభిన్న జీవాకృతులు ఉట్టిపడేలా శిలలపై శిల్పాలు, మానసిక ఉపశమనం కోసం యోగా కేంద్రం తదితర వాటిని తీర్చిదిద్దారు. కొంత కాలంగా ఈ ప్రాంతంలో సందర్శకుల తాకిడి అధికమైంది. అధిక విస్తీర్ణంలో ఈ ప్రాంతం కొలువు తీరటంతో దీనిని మరింత వినూత్నంగా తీర్చిదిద్దితే భవిష్యత్తులో విజయవనం పర్యాటక కేంద్రంగాను అభివృద్ధి చెందే అవకాశం ఉందని నగరవాసులు భావిస్తున్నారు.

● కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆంధ్రజ్యోతి



ఏనుగు ఆకృతిలో జారుడు బల్ల



రహదారికి ఇరువైపుల చెట్లు



మధ్యంతర భృతి ప్రకటించాలి : పీఆర్‌టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలు నగరం బిర్లా కాంపౌండులోని పీఆర్‌టీయూ కార్యాలయంలో శనివారం ఎన్‌వీ కృష్ణారెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలు, పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పదో న్నతి, బదిలీలలో నూతన పాఠశాలలో జాయిన్ అయిన ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు 9.15 గంటల వరకు వేసేలా అవకాశం ఇవ్వాలని కోరారు. విద్యార్థుల హాజరు నమోదుకు 9.30కి గంటలకు బదులుగా 10గంటల వరకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుదర్శన్, మణి కుమార్, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆదోని, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆదోని-కుప్పగల్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. ఆదోని సమీపంలోని గ్రామానికి చెందిన వ్యక్తి అయ్యి ఉంటాడని, 40 నుంచి 45 యేళ్ల మధ్య వయస్సు ఉంటుందని తెలిపారు. ఆధారాలు దొరక్కపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బనగానపల్లె, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తులూరుపాడు గ్రామానికి చెందిన సంజీవరెడ్డి(53) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. బనగానపల్లె పోలీసులు శనివారం తెలిపిన వివరాలివీ.. బత్తులూరుపాడు గ్రామానికి చెందిన సంజీవరెడ్డి బనగానపల్లెలో ట్యూషన్ నిర్వహిస్తూ మరో వైపు వ్యవసాయం చేస్తూ జీవించే వారు. బత్తులూరుపాడు గ్రామంలో 6 ఎకరాలు కౌలుకు తీసుకొని గత ఏడాది మిరప సాగు పూర్తిగా నష్టపోయారు. రూ.10 లక్షలు అప్పు ఉంది. ఈ అప్పు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో ఓ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సంజీవరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆయన భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మధుకుమార్ (ఫైల్)

డోన్ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన మధుకుమార్ (21) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలివీ.. శనివారం డోన్ రూరల్ ఎస్ఐ మమత తెలిపిన వివరాలివీ.. మధు కుమార్ డోన్‌లోని ఓ బైక్ మెకానిక్ షాపులో పని చేస్తుండేవాడు. మధుకుమార్ సోదరిని చూసేందుకు ఆయన బావతో కలిసి బైక్‌పై బేతంచెర్ల మండలంలోని ఆర్ఎస్ రంగాపురానికి బయలుదేరారు. చిన్నమల్కాపురం రైల్వేస్టేషన్ వద్ద వీరు వెళ్తున్న బైకు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మధుకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్ గాయపడ్డాడు. యువకుడి బావ మహేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాటసాని ఓబుళరెడ్డి పై కేసు నమోదు

- డోన్ డీఎస్పీ శ్రీనివాసులు



బనగానపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుళరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పార్టీ విస్తృత సమావేశంలో కాటసాని ఓబుళరెడ్డి తన ప్రసంగంలో సభ్య సమాజం తలవంచుకునేలా మాట్లాడారన్నారు. బాబుష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ పథకానికి వ్యతిరేకంగా ఓ సమావేశం నిర్వహించారన్నారు. ఈసమావేశంలో ఓబుళరెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడారన్నారు. ప్రజాస్వామ్యంగా ఒక పదవిలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రెచ్చగొట్టేలా మాట్లాడటం తగదన్నారు. సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

వెల్దుర్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం గ్రామపంచాయతీ పరిధిలో 3,4, 10 వార్డుల్లో పర్యటించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. గ్రామంలోని పార్వతయ్య వంక వద్ద ఉన్న సంపును పరిశీలించారు. నక్కలదిబ్బ చెత్తసంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి, ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న డీపీవో భాస్కర్

పుణ్యస్నానాలకు వెళ్లి..



గల్లంతుకు ముందు.. సెల్ఫీ తీసుకుంటున్న యువకులు



అజిత్, సచిన్, ప్రమోద్ (ఫైల్)

ఒకే కళాశాలలో ఏడుగురు యువకులు డిగ్రీ చదువుతున్నారు. రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయానికి రావాలని అనుకున్నారు. శనివారం ఉదయమే ఇక్కడికి స్వామివారి దర్శనార్థం వచ్చారు. స్వామిని దర్శించుకొని, సాయంత్రం పుణ్యస్నానాలు ఆచరించేందుకు తుంగభద్ర నదీతీరానికి చేరుకున్నారు. స్నేహితులంతా కలిసి నదిలోకి వెళ్లారు. ఒక్కసారిగా వరద ప్రవాహం ఉధృతమైంది. ఇంతలో వారిలో ముగ్గురు మిత్రులు నదిలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. మరో నలుగురు ఎలాగోలా ప్రాణాలతో ఒడ్డుకు చేరారు. ప్రాణస్నేహితులు నదిలో గల్లంతు కావడంతో వీరు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో తుంగభద్ర తీరం శోకసంద్రంగా మారింది.

- తుంగభద్ర నదిలో ముగ్గురు గల్లంతు
- ప్రాణాలతో బయటపడిన నలుగురు
- వీరంతా డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులే
- వీఐపీ స్నాన ఘట్టం సమీపంలో ఘటన
- ముమ్మరంగా గాలింపు చర్యలు
- శోకసంద్రంగా నదీతీరం

మంత్రాలయం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన యువకులు పుణ్యస్నానాల కోసం తుంగభద్ర నదిలోకి వెళ్లారు. ముగ్గురు గల్లంతు కాగా మరో నలుగురు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈఘటన మఠం సమీపంలో వీఐపీ స్నానఘట్టం సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. వివరాలు.. కర్ణాటకలోని హాసన్ జిల్లా అర్సికేరే మండలం జావగల్ గ్రామానికి చెందిన ఏడుగురు స్నేహితులు శనివారం మంత్రాలయం వచ్చారు. ఉదయం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం పుణ్యస్నానాలు చేయడానికి తుంగభద్ర నదిలోకి వెళ్లారు. అజిత్(19), సచిన్(20), ప్రమోద్(19) స్నానం చేస్తుండగా నీటి ప్రవాహంలో గల్లంతయ్యారు. హేమంత్, నారాయణ, రంగనాథ్, దర్శన్ ప్రాణాలతో బయటపడ్డారు. బయట పడిన యువకులు కేకలు వేయడంతో అక్కడి తోటి భక్తులు వచ్చి చూసేలోపు నదిలో కనిపించకుండా గల్లంతయ్యారు. యువకులంతా డిగ్రీ విద్యార్థులు. వీరిలో ప్రమోద్ ఒక్కడే ఒక బేకరిలో ఉద్యోగం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ శివాంజల్, సర్పంచ్ భీమయ్య, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ అనంతపురా జీక్ ఘటనాస్థలికి చేరుకున్నారు. పుట్టీల సాయంతో గజ ఈతగాళ్లతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో వర్షం పడటంతో గాలింపునకు అంతరాయం కలిగింది. అనంతరం గాలింపు చర్యలు చేపట్టినా చీకటి పడటంతో నిలిపివేశారు. రాత్రి 10 గంటల సమయంలో 13 మందితో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీం వచ్చి గాలింపు చర్యలను చేపట్టింది. ముగ్గురు యువకుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. బయటపడిన యువకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండటంతో నదితీరమంతా శోకసంద్రంగా మారింది. ముగ్గురు ప్రాణమిత్రులు తమ కళ్లెదుటే నదిలో గల్లంతు కావడం జీర్ణించుకోలేకపోతున్నారు. ఆదివారం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి గల్లంతైన వారిని వెలికితీసేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ప్రాణాలతో బయటపడిన యువకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదం నుంచి బయట పడిన యువకులు, పోలీసులతో మాట్లాడుతున్న మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు

హెచ్చరికలు జారీ చేస్తున్నా..

నదిలో దిగవద్దు ప్రవాహం ఎక్కువగా ఉందని మైకులద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నా కూడా పట్టించుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని శ్రీమఠం అధికారులు పేర్కొంటున్నారు. సంఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్‌స్వామి విచారం వ్యక్తం చేశారు.

సమాజాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

- విశ్రాంత ప్రొఫెసర్ దేవరాజ్ మహారాజ్



మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ దేవరాజ్ మహారాజ్

కర్నూలు ఎడ్యుకేషన్/కల్చరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమని విజ్ఞాన చింతన పరిశోధకుడు, విశ్రాంత ప్రొఫెసర్ దేవరాజ్ మహారాజ్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కర్నూలు నగరంలోని డీఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక రంగం దృక్పథం సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ వాస్తవాలకు అద్దం పడుతుందని, దీని వల్ల ప్రజలకు విజ్ఞానం బలమైన కృషి, సామర్థ్యాన్ని, శ్రమైక జీవన సౌందర్యాన్ని గౌరవించే పద్ధతులను పెంపొందిస్తుందన్నారు. మతతత్వం వల్ల సమాజం తీవ్ర స్థాయిలో కలుషితమవుతోందన్నారు. సమాజంలో మూఢనమ్మకాలు విస్తృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనిషికి మించిన అతీత శక్తి మరొకటి లేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ మాట్లాడుతూ విజ్ఞానం భావితరాల ఆస్తిగా మారాలన్నారు. ఈ కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నాయకులు ధనుంజయ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ఉర్దూ వర్సిటీ డీన్ అక్తర్‌భాను, నరసింహ, సుందర విజ్ఞా కేంద్రం నాయకులు ప్రసాద్ శర్మ, రంగస్వామి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, సుధీర్‌బాబు పాల్గొన్నారు.

పలుచోట్ల చోరీలు

- ఓర్వకల్లు, పత్తికొండ మండలాల్లో పేట్రేగిపోయిన దొంగలు
- చాగలమర్రిలో చోరీయత్నం



కాల్వబుగ్గలో చోరీకి గురైన హుండీలు ఇవే



ఆలయంలో చోరీ చేస్తున్న దుండగులు

ఓర్వకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం ప్రధాన ద్వారం గుండాలోనికి ప్రవేశించారు. ఆలయం గర్భగుడికి పడమర ఉన్న కటాంజనం వాకిలికి లోపల ఉన్న తాళాన్ని ఇనుపరాడ్డుతో పగలగొట్టి లోనికి చొరబడి అమ్మవారి, శివుడి ఎదురుగా ఉన్న ఐదు చిన్న హుండీలను ఎత్తుకెళ్లారు. హుండీలను చిన్న కోనేరు సమీపంలోకి తీసుకెళ్లి పగలగొట్టి అందులో ఉన్న చిల్లర మినహా మిగతా నగదును అపహరించుకుని పెద్ద కోనేరు సమీపం నుంచి దుండగులు వెళ్లిపోయారు. అయితే కానుకలు ఎక్కువగా ఉన్న రెండు పెద్ద హుండీలను ఎత్తుకెళ్లేందుకు సాధ్యపడక దుండగులు వదిలేశారు. తలుపులు తెరిచి ఉండటాన్ని ఉదయం వాచ్‌మన్ గమనించి ఈవో మద్దిలేటి దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆలయానికి చేరుకుని చోరీకి గురైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి ఆలయంలో చోరీకి పాల్పడినట్లు సీసీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. సుమా రు రూ.20 వేల నుంచి రూ.30 వేలు నగదు ఉండొచ్చని సమాచారం. ఆలయ ఈవో మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్నహుల్తిలో 4 తులాల బంగారం అపహరణ

పత్తికొండ టౌన్: మండలంలోని చిన్నహుల్తి గ్రామంలో శనివారం పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బోయ రాజశేఖర్ ఇంటికి తాళం వేసుకుని వ్యవసాయ పనుల కోసం భార్యాభర్తలు కలిసి పొలం పనులకు వెళ్లారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన నాలుగు తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ జయన్న ఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చాగలమర్రిలో ఆరు దుకాణాల్లో చోరీయత్నం

చాగలమర్రి: గ్రామంలోని గాంధీ బజార్‌లో శుక్రవారం అర్ధరాత్రి కొందరు దొంగలు హల్‌చల్ చేశారు. వ్యాపార సముదాయం ఉండే ప్రదేశంలోని దుకాణాల తాళాలు, తలుపులు పగలగొట్టి చోరీయత్నం చేశారు. బైసాని మురళి, సుంకు ఆనంద్, గురుప్రసాద్, సుదర్శన్, ఇర్షాద్, సుగుణాకర్‌కు చెందిన ఇళ్ల ముందు ఉన్న దుకాణాల తలుపులు, తాళాలను పగలగొట్టారు. శబ్దాలు రావడంతో ఆయా గృహాల్లో నిద్రిస్తున్న వారు ఉలిక్కిపడి కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. దొంగలు ఒకే రోజు ఆరు దుకాణాల్లో చోరీయత్నం జరగడంతో వ్యాపారులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వ్యాపారులు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలాలను పోలీసులు పరిశీలించారు.



పత్తికొండ : చిన్నహుల్తిలో విచారిస్తున్న సీఐ

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కమిషనర్ విశ్వనాథ్



గార్గేయపురం డంప్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం గార్గేయపురం డంప్ యార్డులో బయోమైనింగ్ పనులను ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలన్నారు. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గడియారం ఆసుపత్రి ఆధునికీకరణ పనులు, శునకాల సంతాన నియంత్రణ ఆపరేషన్లు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంత రం కమిషనర్ పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరుచరితారెడ్డి, బొగ్గుల దస్తగిరిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఏఈ వైష్ణవి పాల్గొన్నారు.

కమిషనర్ రవీంద్రబాబుకు వీడ్కోలు

కర్నూలు న్యూసిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సీడీఎంఏ కార్యాలయానికి బదిలీ అయిన సందర్భంగా శనివారం సాయంత్రం ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో రవీంద్రబాబును మేయర్ బీవై రామయ్య, నూతన కమిషనర్ పి.విశ్వనాథ్, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్వోలు జునైద్, ఇజ్రాయేల్, ఇన్‌చార్జి ఎంఈ శేషసాయి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు పి.గోవిందు డిమాండ్ చేశారు. శనివారం పెద్దపార్కులో యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణంలో ప్రధానంగా తాపీ, పాలిష్‌కట్టర్, గ్రానైట్, టైల్స్ మట్టి, ఎలక్ట్రీషన్, కార్పెంటర్, పెయింటర్ తదితర అనేక రకాల కార్మికులు ఉన్నారని, పనికి తగిన కూలి లేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి టి.రాముడు, ఖాజాపాష, మహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీఈ విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు కోనేటి వెంకటేశ్వర్లు, పగడాల ఆనంద్‌బాబు, ఎద్దుపెంట అంజి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌టీఈ యాక్టు నిబంధనలకు అనుగుణంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశా లలో 25 శాతం ఉచిత విద్యను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహి స్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నటువంటి పాఠ శాలల గుర్తింపును రద్దు చేసి వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. డీఈవోకు వినతి పత్రం అందించిన వారిలో విద్యార్థి సంఘాల నాయకులు బాలకృష్ణ, వాల్మీకి ఎం.హరిక్రిష్ణ, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి

డీఈవోకు డీటీఎఫ్ నాయకుల వినతి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్‌కు డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ నెలలో బదిలీ, పదోన్నతుల ద్వారా కొత్త పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులకు క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీలు కేటాయించాలని కోరారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల జాయి నింగ్ తేదీని కామన్‌గా పరిగణిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏప్రిల్‌లో పదో తరగతి మూల్యాంకనం విధుల్లో పాల్గొన్న ఉపాధ్యా యులకు రెమ్యు నరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేద్దాం


మసూమ్ పీర్ ఖాద్రీకి నియామక పత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని కోడుమూరు కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త అనంత రత్నం మాదిగ అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగరంలోని 40వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా సయ్యద్ మసూమ్ పీర్ ఖాద్రీకి నగర అధ్యక్షులు షేక్ జీలాని బాషా, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ నాయకులు సుంకన్న, గోవిందు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

సి.బెళగల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ పరమేష్‌నాయక్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ మాట్లాడుతూ యువకులు మద్యానికి బానిసలు కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లల దిన చర్యపై దృష్టి పెట్టాలన్నారు.

యూరియా కొరత లేదు: ఏవో

కోడుమూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని వ్యవసాయ అధికారి రవిప్రకాష్ గౌడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో 13 టన్నుల చొప్పున యూరియా ఉందన్నారు. అంతేగాకుండా ప్యాలకుర్తి, డీసీఎం ఎస్‌లకు అదనంగా 13 టన్నుల చొప్పున వచ్చిందన్నారు. వారంలోగా కాంప్లెక్స్ ఎరువులు కూడా ఆర్‌ఎస్‌కేలో అందుబాటులో ఉంటాయన్నారు.

అమ్మో..ట్రాన్స్‌ఫార్మర్లు

- ప్రభుత్వ పాఠశాలలు, ఇళ్ల మధ్య కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పొంచి ఉన్న ప్రమాదాలు

ఓర్వకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులోని సుబ్బారెడ్డి హోటల్ సమీపంలో, ఆసుపత్రి ఎదురుగా, ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండు సర్వీస్ రోడ్డుతో పాటు అనేక గ్రామాల రోడ్లకు ఇరువైపులా కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు దర్శనమిస్తున్నాయి. వీటి వల్ల ప్రమాదాలు జరగవచ్చని పలు దఫాలు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. ఓర్వకల్లులోని మోడల్ స్కూలు, కస్తూర్బా పాఠశాల ఎదురుగా, హుశేనాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారే గానీ కంచె ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. నన్నూరు బస్టాండు సమీపాన ఇళ్ల మధ్య ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. అదేవిధంగా ఇళ్లపైన ఉన్న విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కస్తూర్బా పాఠశాల బయట కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్


మోడల్ స్కూల్ వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

కంచె ఏర్పాటు చేయాలి



మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

● రమేష్, సీపీఐ నాయకుడు

భయం గుప్పెట్లో విద్యార్థులు



ఓర్వకల్లులోని కస్తూర్బా, మోడల్ స్కూల్, హుశేనాపురం జడ్పీ పాఠశాల ప్రాంగణాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయలేదు. ఏ ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

● మహబూబ్ బాషా, విద్యార్థి తండ్రి

అధికారులు పట్టించుకోవడం లేదు



పాఠశాలలు, ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలి.

● అల్లాబాబు, టీడీపీ నాయకుడు, ఓర్వకల్లు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎ.గోకులపాడు గ్రామంలో అర్హులైన 30 మందికి ఆమె ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. గౌరు చరిత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పట్టణ, గ్రామ ప్రజలకు ఇళ్ల స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చారని, ఎ.గోకులపాడులో 30 మంది ఎస్సీలకు ఒక్కొక్కరికీ 1.5 సెంట్ల చొప్పున పట్టాలు అందించామన్నారు. మాజీ సర్పంచు లక్ష్మీవరదారెడ్డి, గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, రమణారెడ్డి, బీజేపీ నాయకుడు సింగం సోమశేఖర్‌రెడ్డి, సుంకన్న, టి.రాజు, రామాంజనేయులు నెరవాడ జాఫర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కమిషనర్ : కర్నూలు నగరపాలక సంస్థ నూతన కమిషనర్ పి.విశ్వనాథ్ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరు చరితకు బొకే అందించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

కర్నూలు క్రైం, జూలై 12(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ఉల్చాల క్రాస్ రోడ్డు వద్ద ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఏడుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. అలాగే ఎలాంటి రికార్డులు లేకుండా, నిబంధనలు పాటించకుండా వెళ్తున్న 150 మందిపై జరిమానాలు విధించారు. అలాగే నగరంలో ఒక్కరోజే ఆర్‌ఎల్‌వీడీ కేమెరాల ద్వారా సిగ్నల్ జంపింగ్ చేసిన వారిని గుర్తించి 650 కేసులు నమోదు చేశారు.

ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలి

ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అల్తాఫ్


మాట్లాడుతున్న అల్తాఫ్

కోడుమూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో విద్యార్థులను కూలీలుగా మార్చి కుర్చీలు ఎత్తించిన ప్రధాన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అల్తాఫ్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కోడుమూరు పట్టణంలోని జీవీఆర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో విద్యార్థుల చేత కుర్చీలు మోపించడం దారుణమన్నారు. విద్యార్థులకు చదువు చెప్పకుండా పనులు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇమ్రాన్, ఖాలీద్, సల్మాన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ సుధీర్ బాబు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

కర్నూలు అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలు, మద్యానికి బానిసలు కావొద్దని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు అన్నారు. శనివారం నగరంలోని ధర్మపేటలో మద్యపాన, మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు జరిగింది. ఎం.సుధీర్ బాబు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్, సీఐలు చంద్రహాస్, రాజేంద్ర ప్రసాద్, ఎక్సైజ్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కడుపులు కొట్టి.. వేతనాలకు సరిపెట్టి

- ఆరేళ్లు నుంచి ఇదే తంతు
- వర్కర్ల నియామకంలో జాప్యం
- సాంఘిక సంక్షేమ శాఖలో వింత పోకడ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కడుపులు కొట్టి... ఉద్యోగుల వేతనాలకు సరిపెట్టిన ఉదంతం సాంఘిక సంక్షేమ శాఖలో కొనసాగుతోంది. ఆ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న కళాశాల వసతి గృహాల్లో వర్కర్ల నియామకాల్లో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. వసతి గృహాల్లో పనిచేసే సిబ్బందిని నియమించకపోవడంతో ఆ హాస్టల్లో పనిచేసే వార్డెన్లు వంట మనిషి, కమాటి, వాచ్‌మన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. నెలనెలా వేతనాలు చెల్లిస్తున్నారు. నెలకు ఒక్కో వసతిగృహానికి సిబ్బంది వేతనాల కింద రూ.35 వేలు దాకా చెల్లిస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరేళ్ల నుంచి ఇదే తంతు కొనసాగుతోంది. వార్డెన్లు తమ ప్యాకెట్ మనీ కింద చెల్లించడం లేదు.

మెస్ చార్జీల్లో కోత కోసి..

రాష్ట్రప్రభుత్వం ప్రతినెల విద్యార్థులకు ఇచ్చే మెస్ చార్జీల్లో కొంత మొత్తాన్ని కోత కోసి సిబ్బంది వేతనాలు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన ఆహార పదార్థాలు అందడంలేదనే విమర్శలున్నాయి. కర్నూలు జిల్లాలో సాంఘిక సం క్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది కళాశాలల బాలుర, బాలికలు వసతి గృహాలు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో ముగ్గురు చొప్పున మెత్తం 24మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈభారం అంతా వార్డెన్ల భరిస్తు న్నారు. ఈఒత్తిడిని భరించలేక కళాశాల వసతి గృహాల్లో పనిచేసేందుకు వార్డెన్లు ముందుకు రావడంలేదు.



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

ఆప్కాస్‌కు ప్రతిపాదనలు



కళాశాల వసతిగృహాల ఉద్యోగుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆప్కాస్‌కు ప్రతిపాదనలు పంపుతున్నాం. గతంలో పనిచేసిన అధికారి మూతపడిన వసతి గృహాల్లో తాత్కాలిక ఉద్యోగులను వెనక్కి పంపడంతో ఈ సమస్య ఏర్పడింది. ఉద్యోగుల నియామకానికి చర్యలు తీసుకుంటున్నాం.

● రాధిక, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి

నిరుద్యోగులను ఆదుకోవడంలో విఫలం: డీవైఎఫ్ఐ

కర్నూలు న్యూసిటీ/ కర్నూలు కలెక్టరేట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగు లను ఆదుకో వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న విమ ర్శించారు. శనివారం కార్మిక కర్షకభవన్‌లో డీవైఎఫ్ఐ 19వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ శంకర్‌శర్మ, రామన్న హాజరై పతాకాన్ని ఆవిష్కరించారు. రామన్న మాట్లాడుతూ సమాజంలో జరుగు తున్న వివక్షలకు వ్యతిరేకంగా డీవైఎఫ్ఐ పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. కేంద్రంలో పదిలక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్ప టికి భర్తీ చేయకుండా యువత భవిష్యత్తుతో బీజేపీ ఆటలాడుతుందని విమర్శించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, ప్రాజెక్టు నిర్మాణం, పరిశ్రమ స్థాపన కోసం మహాసభల్లో తీర్మానం చేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ సమాజం మారాలంటే యువత శక్తి చాలా అవసరమని, ఆశక్తిని డీవైఎఫ్ఐ సరైన రీతిలో నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరేష్, హుస్సేన్ బాషా, దాసు, సురేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, డాక్టర్ శంకర్‌శర్మ

సుపరిపాలనతో ప్రజలు హర్షం

'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సారథ్యంలో సాగుతున్న సుపరిపాలనతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం నగరంలోని 42వ డివిజన్‌లో ఇన్‌చార్జి తమ్మారెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, నంద్యాల నాగేంద్ర, సోమిశెట్టి నవీన్, సత్రం రామకృష్ణ, వలి, సురేఖ, విజయభారతి, షేక్ హనీముణ్ణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

సి.బెళగల్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో 'తొలి అడుగు' టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. బురాన్‌దొడ్డిలో సీసీ రోడ్డు, మురుగు కాలువలు, జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ, ఎంపీపీ స్కూల్‌కు వంటగది, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు బాలజీ, చరణ్‌గౌడు, ఎంపీటీసీ ఈరన్నగౌడు, అమర్, భీమన్న, విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, గోవిందు, రామకృష్ణ పాల్గొన్నారు.

● పులకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సిబెళగల్ చెరువుకు నీరు వదలాలని మత్స్యకారులు శనివారం బురాన్‌దొడ్డి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే దస్తగిరికి విన్నవించారు. సి.బెళగల్ చెరువును కొంతమంది కబ్జా చేయాలని చూస్తున్నారని, దానిని కాపాడాలని కోరారు. ఎమ్మెల్యే ఎస్ఈతో మాట్లాడి సిబెళగల్ చెరువుకు నీరు వదిలేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు రామాంజినేయులు, వెంకటేశ్వర్లు, గోవిందు, లింగన్న పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అబివృద్ధి చెందుతుందని విష్ణు హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న అన్నారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని ఎస్సీ కాలనీలో హమాలీ యూనియన్ నాయకులు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు రంగన్న, లక్ష్మన్న, రత్నం, నాగరాజు పాల్గొన్నారు.

గూడూరు: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ మండల అధ్యక్షుడు జె.సురేష్ అన్నారు. శనివారం మండలంలోని చనుగొండ్ల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షే మ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిడ్డయ్య, ఉరుకుందు, రామాంజనేయులు, మోహన్, రంగయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఓర్వకల్లు: వైసీపీ పాలనలో కుంటు పడిన అభివృద్ధిని రెండింతలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. నాయకులు అల్లాబాబు, శ్రీరాములు, అయూబ్ బాషా, వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజు, ఆదాంబాషా, అబ్దుల్లా పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొంగనపాడు టీడీపీ నాయకుడు టి.వినోద్‌కుమార్ అన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో శనివారం ఆయన కొంగనపాడు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా టి.వినోద్‌కుమార్ మాట్లా డుతూ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోరంట్ల, నాగయ్య, లక్ష్మన్న, మురళి పాల్గొన్నారు.

కోడుమూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని టీడీపీ నాయకులు మాలమహానాడు మునిస్వామి అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులో శనివారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే పట్టణంలోని ఆయా వార్డులో టీడీపీ నాయకులు గోపాల్ నాయుడు, బడెసాగౌడ్, రాముడు, బలరాం, రంగస్వామి, నారాయణ, క్రిష్ణ, గోవర్థన్, భాస్కర్ ఇంటింటికి తిరిగి పథకాల గురించి ప్రజలకు వివరించారు.

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో ఎంతో సంక్షేమం జరిగిందని టీడీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగాధర్ నాయుడు అన్నారు. శనివారం ప్యాలకుర్తి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉగాది వెంకటేశ్వర్లు, రంగన్న యాదవ్, సీతారాముడు పాల్గొన్నారు.


'తొలి అడుగు'లో పాల్గొన్న 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు


బురాన్‌దొడ్డిలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి


కొంగనపాడులో కరపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

నేడు వైద్య శిబిరం

ఆదోని టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రాజపుత్ బొందిలి సంఘం ప్రతినిధి నారాయణ్ సింగ్ తెలిపారు. కర్నూలు కిమ్స్ వైద్యులచే పరీక్షలు చేస్తారని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సీపీఐ మండల కార్యదర్శిగా కృష్ణ



వెల్దుర్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ వెల్దుర్తి మండల కార్యదర్శిగా కృష్ణ మూడోసారి ఎన్నికయ్యారు. శనివారం పత్తికొండలో జరిగిన నియోజకవర్గస్థాయి మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. తనను ఎంపిక చేసిన నాయకులకు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.



ఆలూరు కార్యదర్శిగా రామాంజనేయులు

ఆలూరు: సీపీఐ ఆలూరు కార్యదర్శిగా రామాంజనేయులు ఎన్నికైనట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య శనివారం తెలిపారు. 12వ సీపీఐ మహాసభల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. సహాయ కార్యదర్శిగా ఎస్.ఎస్.బాషాతో పాటు మరో 15 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు జి.ఎర్రగుడికి ఎమ్మెల్యే



మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండంలోని జి.ఎర్రగుడి గ్రామానికి పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు రానున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, అన్నారు. శనివారం మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించనున్న సుపరిపాల నలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. పత్తికొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్ బర్మా వీరేష్ ఉన్నారు.

శాంతి భద్రతలకు ఆటంకం కలిగించొద్దు



మాట్లాడుతున్న సీఐ పులిశేఖర్

మద్దికెర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలిగిచవద్దని సీఐ పులిశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని మదనంతపురం గ్రామంలో పర్యటించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు తెలియజే యాలన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అపరిచి తులు గ్రామాల్లో సంచరిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించ వద్దన్నారు. సైబర్ నేరస్థులు పోన్లు చేస్తే 1930కి పోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్ఐ విజయకుమార్, టీడీపీ నాయకులు సంజప్ప, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎఫ్‌సీ సేవలు కొనసాగించాలి

పత్తికొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షుడు వెంకటేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పత్తికొండలో మండల మహాసభ నిర్వహించారు. డివిజన్ కేంద్రమైన పత్తికొండలో ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నాయ కులు నరసింహ, చుక్కప్ప, ఆనంద్, సీఐటీయూ నాయకులు గోపాల్, రవిచంద్ర పాల్గొన్నారు. అనంతరం అధ్యక్షుడిగా మోహన్, ఉపాధ్యక్షుడిగా ఎన్టీఆర్, కార్యదర్శిగా శేఖర్, సహాయ కార్యదర్శిగా వలీ, కోశాధికారిగా షబ్బీర్ తదితరులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

వెల్దుర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించడానికి కృషిచేస్తున్నామని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం 14, 15 వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీవాసులు నీరు వారం రోజులకోసారి వదలుతున్నారని పరిష్కరించాలని, సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యదర్శి లక్ష్మీనాథ్, వీరభద్రుడు, హరి, నాగసూరి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

పత్తికొండటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో బీజేపీ యువ నాయకుడు మధుగౌడ్‌పై దాడి చేసిన కానిస్టేబుల్ రఫిక్‌పై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ కో కన్వీనర్ గోవర్ధన్‌నాయుడు, కరణం నరేష్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ గోసంరక్షణలో క్రియాశీలకంగా పనిచేస్తున్న మధుగౌడ్‌పై కానిస్టేబుల్ దాడి చేయడం అమానుషమన్నారు. పూనా మల్లికార్జున, రామంజి, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేలం అవినీతిపై ఫిర్యాదు చేస్తాం

ఆదోని టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ దుకాణాల వేలాల్లో చోటుచేసుకున్న అవినీతిపై డీఎంఏకు ఫిర్యదు చేస్తామని మైనార్టీ పోరాట సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. శనివారం మాట్లాడుతూ రైల్వే స్టేషన్ రోడ్డు, ఎల్‌బీ స్ట్రీట్ 37 దుకాణాల లీజు ముగియడంతో బహిరంగ వేలం వేయకుండా పాత యజమానులకే అప్పగించారన్నారు. ఇందులో రూ. లక్షలు చేతులు మారాయని పత్రికల్లో ప్రకటన కేటాయించడంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడిందని ఆరోపించారు. అధికారులు విచారణ చేయని పక్షంలో లోకాయుక్తలో ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న నూర్ అహ్మద్

తాగేదెలా?



బొళ్లవానిపల్లె గ్రామంలోని మినీ ట్యాంకు పరిసరాలు ఇలా..

తుగ్గలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొళ్లవానిపల్లెలో 1500 మంది నివసిస్తున్నారు. తాగునీరు అందించేందు మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే వాటి చుట్టూ అపరిశుభ్ర వాతావరణం ఉంది. పాచి పట్టి ఉండటంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, నీరు ఎలా తాగాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి, ట్యాంకు చుట్టూ సీసీ కాంక్రీట్ నిర్మించాలని కోరుతున్నారు.

నడిపేదెలా?



బురద నీటిలో అవస్థలు పడుతున్న వాహనదారులు

దేవనకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెదొడ్డి రహదారిపై గుంత ఏర్పడటతో వర్షపు నీరు నలిచిపోయింది. దీంతో పాదచారులు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అదుపు తప్పే ప్రమాదముంది. రాత్రిళ్లు ఈ దారిల రావాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించకి, సమస్యను పరిష్కరించాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

కంప తొలగింది.. నీరు పారనుంది

● గతంలో కంప, జమ్ముతో సాగునీరు అందక రైతుల ఇబ్బంది ● నిధులు విడుదల చేసిన ప్రభుత్వం



కప్పట్రాళ్ల వద్ద శుభ్రమైన హంద్రీ నీవా కాలువ

దేవనకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పట్రాళ్ల వద్ద హంద్రీకాలువలో ముళ్ల కంప తొలగించడంతో ఇక సాగునీటి విడుదలకు మార్గం సుగమమైంది. పత్తికొండ మండలం పందికోన రిజర్వాయర్ నుంచి దేవనకొండ మండలం మీదుగా గోనేగండ్ల మండలం ఎర్రబాడు వరకు దాదాపు 27 కి.మీ.ల మేర హంద్రీనీవా కుడి కాలువను పదేళ్ల క్రితం నిర్మించారు.

నిర్వహణ లేక..

కాలువ నిర్మాణం అనంతరం దీన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోపోవడంతో కాలువలో ముళ్ల కంప, జమ్ము పెరిగిపోయి నీరు ముందుకు సాగే అవకాశం లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పూడికితీత పనులు పూర్తిచేశారు. కాగా 12 నుంచి 15.6 కి.మీ. వరకు పనులు మరో దశలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

సాగునీటికి ఇబ్బంది ఉండదు



పందికోన రిజర్వాయర్, కుడి కాలువల్లో జమ్ము, ముళ్ల కంపను తొలిగించాం. ఇందుకు ప్రభుత్వం రూ.28 లక్షలను కేటాయించిది. దేవనకొండ మండల తూములకు మూడు చోట్ల రూ.5 లక్షలతో గేట్లు ఏర్పాటు చేయాలి. 12 కి.మీ. నుంచి 15.6 వరకు రెండో దశలో పనులు పూర్తి చేస్తాం. పనులు పూర్తి కావడంతో కాలువలో సాగునీటికి ఇబ్బంది ఉండదు. పిల్ల కాలువలు, పెండింగ్ పనులకు రూ.210 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే పెండింగ్ పనులు కుడా పూర్తి చేస్తాం.

- గుణకర్ రెడ్డి, ఈఈ, పందికోన రిజర్వాయర్

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ సీఐ

ఆదోని, జూలై 12(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. శనివారం మార్కెట్ సమీపంలో ఆటో డ్రైవర్లకు సూచనలు చేశారు. వాహనాన రికార్డులతో పాటు ట్రాఫిక్ పోలీసులు అందించే క్యూఆర్ కోడ్ నంబర్‌ను తప్పనిసరిగా వాహనానికి ఉండాలన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, అధిక మొత్తంలో డిమాండ్ చేసి ఇబ్బందులకు గురి చేసినా చర్యలు తప్పవన్నారు.. మద్యం తాగి నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయవాదులు

ఆదోని రూరల్, జూలై 12 ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని న్యాయవాదులు వీరేష్, నెట్టికంఠయ్య సూచించారు. ఈ నెల 16వ తేదీ వరకు వారోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కక్షిదారులు కోర్టు కేసులను పెద్దల సమక్షంలో చర్చించుకోవాలన్నారు. రాజీ కుదుర్చుకోవాలని, రాజీ మార్గమే రాజమార్గమని గుర్తించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, జూలై 12(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందని ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి అన్నారు. శనివారం సౌత్ ఇండియా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్స్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ శని, ఆదివారాల్లో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఇక్కడికి వచ్చే అథితులకు స్వాగతం పలుకుతున్నట్లు, ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

నిరుద్యోగులను ఆదుకోవడంలో విఫలం: డీవైఎఫ్ఐ

కర్నూలు న్యూసిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను ఆదుకో వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న విమ ర్శించారు. శనివారం కార్మిక కర్షకభవన్‌లో డీవైఎఫ్ఐ 19వ జిల్లా మహాసభలు నిర్వహించా రు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ శంకర్‌శర్మ, రామన్న హాజరై పతాకాన్ని ఆవిష్కరించారు. రామన్న మాట్లాడుతూ సమాజంలో జరుగు తున్న వివక్షలకు వ్యతిరేకంగా డీవైఎఫ్ఐ పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. కేంద్రంలో పదిలక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్ప టికి భర్తీ చేయకుండా యువత భవిష్యత్తుతో బీజేపీ ఆటలాడుతుందని విమర్శించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, ప్రాజెక్టు నిర్మాణం, పరిశ్రమ స్థాపన కోసం మహాసభల్లో తీర్మానం చేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ సమాజం మారాలంటే యువత శక్తి చాలా అవసరమన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

మద్దికెర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, గడ్డం రామాంజనేయులు అన్నారు. శనివారం మద్దికెరలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మీసేవా భీమ రాజు, గొడుగు సతీష్ కుమార్ ఉన్నారు.

తుగ్గలి: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ మసాల శ్రీను అన్నారు. శనివారం పెండేకల్ ఆర్ఎస్‌లో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఖాసింవలి, నాగరాజు, ప్రసాద్, విద్యాకమిటి చైర్మన్ అమీనా, తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

ఆలూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తామని ఆదోని వీహెచ్‌పీ అధ్యక్షుడు అర్థగేరి బసవన్నగౌడ్ అన్నారు. శనివారం ఆలూరు బెళ్లిగుండు ఆంజనేయస్వామి ఆలయంలో కమిటీని ఎన్నుకున్నారు. ఆలూరు ప్రఖండ గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, ఆలూరు మండలాధ్యక్షుడిగా శంభులింగస్వామి, ఉపాధ్యక్షుడుగా పురుషోత్తం, నాగేష్, కార్యదర్శిగా హనుమంతు ఎన్నుకున్నారు.

'అన్నదాత సుఖీభవ' ఎప్పుడు?

మద్దికెర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తుందని వైసీపీ నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, మల్లికార్జున యాదవ్, కృష్ణా యాదవ్ ప్రశ్నించారు. శనివారం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరక రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా నాగరాజు

హాలహర్వి, జూలై 12(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సర్పంచులు, ఎంపీటీసీల సహకారంతో రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తామని, తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

సూర్యఘర్‌ను వినియోగించుకోండి

మద్దికెర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు పీఎం సూర్యఘర్‌ను వినియోగించుకోవాలని విద్యుత్ ఏఈ మహ్మద్ రఫి సూచించారు. శనివారం విద్యుత్ కేంద్రంలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ పథకంలో రూ.30వేల నుంచి రూ.78వేల వరకు సబ్సిడీ వస్తుందని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. లైన్‌మెన్ వెంకటరమణ, విద్యుత్ సిబ్బంది శేషు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి



ఆస్పరి : కరపత్రాలను అందజేస్తున్న వీరభద్రగౌడ్

ఆస్పరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. శనివారం తంగరడోణ, బిణిగేర, చిగిలి గ్రామాల్లో కూటమి ప్రభుత్వ సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేసి ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరించారు. పింఛన్ల పెంపు, ఉచిత సిలిండర్లు అందజేత, తల్లికి వందనం పథకాన్ని అమలు చేశాడన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కూడా అమలు చేస్తారని తెలిపారు. నాయకులు నాగేశ్వర రావు, శేషాద్రినాయుడు, మేకల రంగనాథ్, కొంక మధు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఎంపీటీసీ రహంతుల్లా, సాలి సాహెబ్, రాజ్‌కుమార్, హరి, నారాయణ, రామంజిని, మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి

దేవనకొండ: రాష్ట్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి అని ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని మాచాపురం, ఈదుల దేవర బండ, కరివేముల గ్రామాల్లో నిర్వహించారు. బడిగింజల రంగన్న, సూభాన్, వీరేష్, మలకన్న, బడేసాబ్, వీరేష్, కప్పట్రాళ్ల మల్లికార్జున పాల్గొన్నారు.

రైతు క్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, జూలై 12(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు పేర్కొన్నారు. శనివారం నాగలాపురం గ్రామంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డితో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఉమాపతినాయుడు, దేవేంద్రప్ప, శ్రీకాంత్‌రెడ్డి, మారుతినాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి పాల్గొన్నారు.

ఆదోని వాసికి ఎన్టీఆర్ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న గరుడాద్రి దత్తాత్రేయ శర్మ

ఆదోని అగ్రికల్చర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తెలుగు భాషా సాహితీవేత్త డాక్టర్ గరుడాద్రి దత్తాత్రేయశర్మ శనివారం హైదరాబాద్‌లో ఎన్టీఆర్ స్మారక పురస్కా రాన్ని అందుకు న్నారు. తాను 23 ఏళ్లుగా తెలుగు భాషాభివృద్ధి చేస్తున్న కృషిని గుర్తించి, హైదరాబాద్‌కు చెందిన తెలుగు వెలుగు సాహిత వేదిక, కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు గుర్తించి పురస్కారాన్ని అందజేశారన్నారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పోలోజు రాజకుమారాచార్యులు, రాష్ట్ర అధ్యక్షుడు మండలి లక్ష్మణ బాబు చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఆర్‌డీటీ సేవలు కొనసాగించాలి

తుగ్గలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో స్వచ్ఛంద సంస్థ సేవలను కొనసాగించేలా చూడాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు నబీ రసూల్, రోళ్లపాడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు వినతి పత్రం ఇచ్చారు స్పందించిన రామకృష్ణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, ఆర్‌డీటీ సేవలు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడతాయన్నారు.



రామకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వైభవంగా పెద్ద సరిగెత్తు

తుగ్గలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శభాష్‌పురంలో పీర్లచావిడిలలో కొలువుదీరిన దస్తగిరి స్వామి, అక్బర్ స్వాములతో పాటు పీర్లచావిడిలలో కొలువుదీరిన పీర్లను భక్తులు చక్కెర, పూలు వెండి బంగారు ఆభరణాలతో పాటు చదివింపులు చదివించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామాంజనమ్మ, సర్పంచ్ పుష్పావతి, హనుమంతు, రవి, రాఘవరెడ్డి, రంగారెడ్డి, టీడీపీ నాయకులు తిమ్మన్న, ఆదినారాయణ, మోహన్, శ్రీరాములు, పోలీస్ సంఘం రాష్ట్ర నాయకులు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాయిదాల చెల్లింపులో వీవోఏ చేతివాటం

● రూ.12వేలు అధికంగా వసూలు

హొళగుంద, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలు సొంతంగా వ్యాపారం చేసుకుని తీసుకున్న రుణాలు చెల్లించి, కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే ఓ వీవోఏ యానిమేటర్(విలేజ్ ఆర్గనైజర్ అసిస్టెంట్) చేతి వాటం ప్రదర్శించినట్లు సమాచారం. పారిజాతం గ్రూప్ సభ్యుల నుంచి రుణాల చెల్లింపులను తస్థానిక వెలుగు కార్యాలయంలో రికవరీ చేసే వీవోఏ శ్రీనిధి వాటిని బ్యాంకుల్లో చెల్లించకుండా, నకిలీ బిల్లు ఇచ్చి మోసం చేసినట్లు పొదుపు మహిళ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 2023లో సభ్యులకు శ్రీనిధి కింద రూ.2లక్షలు రుణాలు మంజూరు కాగా, నలుగురు సభ్యులు తలా రూ.50 వేలు చొప్పున తీసుకున్నారు. చంద్రమ్మ, వడ్డే పార్వతితో పాటు మరో ఇద్దరు 18 వాయిదాలతో నెలకు రూ.3 వేల చొప్పున మొత్తం రూ.12వేలు క్రమంగా చెల్లించారు. రుణం మొత్తం తీరిపోయింది. సదరు వీవోఏ 19వ కంతును జూన్ నెలలో కట్టించుకుని, చేతిరాతతో రాసిన బిల్లు ఇచ్చింది. అనుమానం వచ్చిన సభ్యులు విచారించగా సదరు వీవోఏ రూ.12వేలు స్వాహా చేసినట్లు తేలడంతో సదరు వీవోఏ ను నిలదీశారు. ఆమె తిరిగి చెల్లిస్తానని తెలిపింది. సదరు వీవోఏపై చర్యలు తీసుకోవాలని ఏపీఎం సూర్య ప్రకాష్ దృష్టికి తీసుకువెలినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై ఏపీఎం సూర్య ప్రకాష్‌ను వివరణ కోరగా విచారణ చేసి, చర్యలు తీసుకుంటామన్నారు.



విలేకర్లతో వాగ్వాదం చేస్తున్న ఐకేపీ ఏపీఎం సూర్య ప్రకాష్

గ్రామాల్లో రోడ్లకు మహర్దశ

● ఏడాది కాలంలో రూ.4.38 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం
● కడిమెట్లలో రూ.45లక్షలతో సీసీ రోడ్ల ఏర్పాటు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా గ్రామంలోని వీధుల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షం వచ్చిన సమయం లోను, రాత్రివేళల్లో ప్రజలు ఆరోడ్లపై నడిచేందుకు ఇబ్బం దులను ఎదుర్కొనేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గ్రామా న్ని సందర్శించిన సమయంలో ప్రజలు తమకు సీసీ రోడ్లు కావాలని, రోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పంచాయతీ రాజ్ అధికారులను గ్రామంలో సీసీ రోడ్లు వేయాలని ఆదేశాలు జారీచేశారు. మార్చి 24వ తేదీన పనులు ప్రారం భించి ఏప్రిల్ 9వ తేదీ నాటికంతా పనులను పూర్తి చేశారు. దీంతో గ్రామంలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటక ముందే ఎమ్మిగనూరు మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్లకు మోక్షం వచ్చింది. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో మొత్తం రూ.4.38కోట్లతో అధికారులు సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి స్వగ్రామమైన కడిమెట్ల గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటకముందే రూ.45లక్షలతో సీసీ రోడ్లు వేసి ప్రజలకు దారి కష్టాలు తీర్చారు అధికారులు. దీంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


కడిమెట్ల గ్రామంలో సీసీ రోడ్డు వేయకముందు దుస్థితి


కొత్తగా వేసిన సీసీ రోడ్డు

మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా గ్రామంలో అభివృద్ధికి బాటలు పడ్డాయి. అధికారులు మారుమూల కాలనీల్లో కూడా సీసీ రోడ్లు వేశారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని చోట్ల సీసీ రోడ్లు వేసినా డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఆ సమస్యలేకుండా పోయింది. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నాం.

● విరుపాక్షిరెడ్డి, కడిమెట్ల

రోడ్డు కష్టాలు తీరాయి



మా గ్రామంలో ఎన్నో ఏళ్లుగా సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. వర్షం వచ్చిందంటే కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా పోయేది. రాత్రివేళల్లో వృద్ధులు, చిన్నారులు బయటకు వచ్చి ప్రమాదాలకు గురయ్యేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలో సీసీ రోడ్లకు మోక్షం వచ్చింది.

● చంద్ర, కడిమెట్ల

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


లక్ష్మీ పేటలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఎమ్మిగనూరు టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణగా కంచెలేక ప్రమాదకరంగా మారింది. 33వ వార్డు లక్ష్మీపేట కల్లుపెంట దగ్గర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చాలా ప్రమాదకరంగా ఉండడం అక్కడి ప్రజలను కలవరపెడుతోంది. ఆవిద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణగా కంచె ఏర్పాటు చేయకపోవడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. చిన్న పిల్లలు కూడా అందుకునేంత ఎత్తులో ఉండడం వల్ల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కొన్ని సందర్భాలలో వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై నీరు పడి వాటిపైన చెట్ల కొమ్మలు పడి నిప్పు రవ్వలు ఎగిసిపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. కంచెలు లేక ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యత అంటూ స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు హేమంత్‌కుమార్

గోనెగండ్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): కంటి ఆపరేషన్ అవసరమైన నిరుపేదలకు ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు ఆర్‌కే కంటి ఆసుపత్రి యందు ఉచితంగా కంటి ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, ఆర్‌కే కంటి ఆసుపత్రి వైద్యులు హేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈశిబిరానికి 160 మంది హాజరయ్యారు. వారికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో 46 మందికి శుక్లాలు ఉన్నట్లు నిర్ధారణ చేసి ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిగతా వారికి ఉచితంగా మందులు కంటి చుక్కల మందుల అందజేశారు. ఉచిత ఆపరేషన్ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్‌రావు, నటరాజారెడ్డి, బీరప్ప, మాచాని నాగరాజు, కేశవరెడ్డి, రాజు, రవీంద్ర, శంకర్ పాల్గొన్నారు.

రైతులందరికీ సకాలంలో యూరియా


సబ్సిడీ యూరియాను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సకాలంలో సబ్సిడీ యూరియాను టీడీపీ ప్రభుత్వం అందజేస్తుందని రైతులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, సీనియర్ నాయకులు ఈరన్నగౌడ్, వ్యవసాయ కమిటీ ఛైర్మన్ గోపాల్, మండల కన్వీనర్ ఖాసీం వలి, టీడీపీ నాయకులు రైస్ మిల్లు నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన నందవరంలో రైతులకు పీఏసీఎస్ కార్యాలయంలో ఎరువులు అందజేశారు. ఈ సందర్భంగా వారు టీడీపీ రైతుల కోసం చేపట్టిన పలు పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, మాజీ కన్వీనర్ చిన్నరాముడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై పోరుబాట


ఎమ్మిగనూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇంటికి బిగించకుండా అడ్డుకోవాలని ప్రజలను సీపీఎం కార్యదర్శి గోవిందు, రాముడు ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పట్టణంలోని ఇంటింటికి, షాపులకు తిరుగుతూ 'ప్రస్తుతం ఉన్న మీటర్లను తొలగించి అదానీ కంపెనీ స్మార్టు మీటర్లు బిగించడానికి మీ ఇంటికి వస్తున్నారు, తస్మాత్ జాగ్రత్త' అని ప్రజలను హెచ్చరిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఇప్పటికే ఆఫీసులో వ్యాపార సంస్థలకు, షాపులకు, స్మార్టు మీటర్లు బిగించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం బాదుడే బాదుడు అని కార్యక్రమం పెట్టి ఓట్లు దండుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజల ఇండ్లకు స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారాలు వేస్తే సీపీఎం ఇంటింటికి ప్రచారం చేసి పెద్ద ఎత్తున ప్రభుత్వ విధానాలపై పోరుబాట నిర్వహిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మన్న, కాలప్ప, మధు, శ్రీను పాల్గొన్నారు.

కోసిగి,

స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ.. ట్రూఆప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 14న కోసిగి విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్నట్లు సీపీఎం మండల నాయకులు రాముడు, వీరేష్ తెలిపారు. శనివారం స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూఆప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ కోసిగితో పాటు బెళగల్, చిన్నభోంపల్లి, పెద్దభోంపల్లి తదితర గ్రామాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి


మంత్రి నిమ్మల రామనాయుడును కలిసిన టీడీపీ నాయకులు

మంత్రాలయం/కౌతాళం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో తమకు అవకాశం కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును, ఇరిగేషన్ శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడును మంత్రాల యం టీడీపీ నాయకులు కలిసి విన్నవించారు. శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి వర్గానికి చెందిన దాదాపు వంద మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు ఇంటి వద్దకు వెళ్లి, ఇరిగేషన్ శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడును క్యాంపు కార్యాలయంలో, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కోట్రేష్‌గౌడు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు భరద్వాజ్‌శెట్టిలు కలిసి మంత్రాల యం నియోజకవర్గంలోని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వివరిం చారు. నాయకులు నాడిగేని మహాదేవ, నరసారెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహులు, ఇంద్రసేనారెడ్డి, నీలకంఠరెడ్డి, దశరథరాముడు, వీరేష్‌గౌడు, ఉలిగయ్య, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు సోల్మాన్‌రాజు, హంపయ్య, నరసింహారెడ్డి, రామయ్య, మారేష్ పాల్గొన్నారు.

వైసీపీ పట్టణ విద్యార్థి విభాగం ఎన్నిక

ఎమ్మిగనూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన ఉసేని వైసీపీ పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా ఎంపికయ్యారు. శనివారం వైసీపీ పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షులు ఉసేని మాట్లాడుతూ తనపై నమ్మ కంతో పట్టణ అధ్యక్షులుగా ఎంపిక చేసిన వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు చేస్తామన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

గోనెగండ్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలోని బీసీ కాలనీలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ఇంటి మిద్దే కూలింది. మిద్దే కూలే శబ్ధం రావడంతో కుటుంబసభ్యులు అందరు ఒక్కసారిగా పరుగుపరుగున ఆరుబయటకు వచ్చారు. దీంతో ప్రాణాపాయం తృటిలో తప్పింది. బోయ కౌలుట్లయ్య కుటుంబం కూలీ పనులు చేస్తు జీవనం సాగించేవారు. అయితే శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో ఇంట్లో భార్యాపిల్లలతో కలిసి భోజనం చేస్తుండగా ఊహించని విధంగా మిద్దె శబ్ధం చేస్తూ కూలింది. వెంటనే అందరూ బయటకు పరుగులు తీశారు. ఉన్న ఒక్క ఇళ్లు కూలీ పోవడంతో నిరాశ్రయులయ్యారు. నడివీధిలో జీవనం సాగించాల్సి వచ్చింది. ప్రభుత్వం గృహాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర ప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖాజా పాషా అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పెద్దపార్కులో మహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు ఖాజా పాషా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ప్రధానంగా గౌండా పని, తాపీ, పాలిష్ కట్టర్, గ్రానైట్, పెయింటర్స్ మొదలైన అనేక రకాల కార్మికుల పనికి తగిన వేతనం లేక కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాగరాజు, ఖాజా, వెంకట్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో రామ,సీత, లక్ష్మణ బృందావన ప్రతిష్ఠాపన మహోత్సవం


కొల్లాపూర్ మహాలక్ష్మమ్మ ఆలయంలో పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రామ, సీత, లక్ష్మణులతో పాటు రాఘవేంద్రస్వామి మృత్రిక బృందావనాన్ని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రతిష్ఠాపన చేశారు. శనివారం మహారాష్ట్రాలోని కొల్లాపూర్ మహాలక్ష్మమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన పీఠాధిపతి, అనంతరం నూతనంగా ఏర్పాటుచేసిన బృందావనాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఉదయం నుంచి మూలరాములకు సంస్థాన పూజ నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. సామూహిక సప్తముద్ర దారణ చేశారు. రాఘవేంద్రస్వామి మహిమలను అక్కడి వేలాది మంది భక్తులకు పీఠాధిపతి దివ్యసందేశాన్ని ఇచ్చారు. అనంతరం భక్తులకు శేషవస్త్రం, మెమెంటో, ఫలపుష్పమంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాజాఎస్ అప్రమేయాచార్, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి, వరదేంద్రాచార్, ఉడిపి పరమేషాచార్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీమఠానికి రూ.2లక్షలు విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన కౌశల్ కావలె అనేభక్తుడు రూ.2 లక్షలు అన్నదానంకు విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజరు ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం,ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

రాఘవరాయుడి సర్కిల్‌లో మయూరం

మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో మయూరి (నెమలి) నాట్యం చేస్తూ భక్తులకు కనువిందు చేసింది. శనివారం సాయంత్రం సంధ్యా సమయంలో పడీపడని చిరుజల్లుల వర్షంలో ఎక్కడి నుంచి వచ్చిందోగానీ సీఆర్‌వో కార్యాలయంపై మయూరీ నాట్యం చేసింది. ఈ కనువిందు దృశ్యాలను ఎప్పుడు రద్దీగా ఉండే సర్కిల్‌లో భక్తులు తిలకించి ఆనంద పరవశితులయ్యారు. అనంతరం తమ సెల్‌ఫోన్లలో మయూరీ నాట్యాన్ని తిలకిస్తూ బంధించారు.


మంత్రాలయం సీఆర్‌వో ఆఫీసుపై విహరించిన మయూరం

వైసీపీ ఎస్టీ విభాగ అధ్యక్షుడి ఎన్నిక

ఎమ్మిగనూరు టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ఎస్టీ విభాగ అధ్యక్షుడిగా ఎరుకల కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక, సీనియర్ బుట్టా నీలకంఠకు, రాష్ట్ర యువ విభాగ ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థిని పరామర్శించిన టీడీపీ నేతలు


విద్యార్థిని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): గుండె ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న విద్యార్థి సిద్ధార్థను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాదవరావు, మండల కన్వీనర్ ఖాసీంవలి, సీనియర్ నేత, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ముగతి ఈరన్న గౌడ్, నందవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గోపాల్ శనివారం పరామర్శించారు. నందవరానికి చెందిన టీడీపీ నాయకుడు వడ్డె మురళి కుమారడు సిద్ధార్థ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. గుండెకు రెండు హోల్స్ మూసుకుపోయి తీవ్ర అనారోగ్య సమస్యలో ఇబ్బంది పడుతుంటూ తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఆపరేషన్ చేయించారు. మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారం అందించారని వారు తెలిపారు. విద్యార్థి కోలుకుంటున్నారని, పార్టీ అండగా ఉంటమని తెలిపారు. టీడీపీ నాయకులు మల్లప్ప, మల్లికార్జున, శ్రీనివాసులు, బోయ మోహన్, బంగారి, షరీఫ్, సుబాన్, ఈరన్న పరామర్శించారు.

మట్కా బీటర్లు అరెస్ట్

ఎమ్మిగనూరు టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మట్కా బీటర్లని పట్టణ సీ ఐ శ్రీనివాసులు శనివారం అరెస్ట్ చేశారు. పట్టణ సీ ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు వడ్డే సంఘం దగ్గర బహిరంగ ప్రదేశంలో మట్కా ఆడుతున్న వడ్డే శ్రీనివాసులు, అతనితో పాటు మరో ఆరు మంది కలసి మట్కా ఆడుతుండగా అరెస్ట్ చేసి వారి దగ్గర ఉన్న రూ. 14760, ఏడు మట్కా చీటీలు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

15లోపు పంటల బీమా చేసుకోవాలి

గోనెగండ్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 15 లోపు రైతులు పంటల భీమా ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, మండల వ్యవసాయ శాఖ ఆధికారి హేమలత కోరారు. శనివారం గోనెగండ్ల వ్యవసాయశాఖ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధాన పంటలు పత్తికి ఎకరానికి రూ. 2000, వేరుశనగకు రూ. 560, వరికి రూ. 80, రెడ్ చిల్లికి రూ. 360, ఉల్లికిరూ. 90, ప్రకారం ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు కచ్చితంగా పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల దగ్గర సిబ్బందిని సంప్రదించి పంటల బీమా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు: డీఎస్పీ

కౌతాళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు హెచ్చరించారు. మండల పరిధిలోని కుంటనహల్ గ్రామంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కేసుపై కౌతాళం సీఐ అశోక్ కుమార్‌తో కలిసి విచారణ చేపట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైన అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఫ్యాక్షన్ జోలికి వెళ్ళి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

పండ్ల మొక్కల పంపిణీ

గోనెగండ్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఏపీవో మహమ్మద్ భాషా, ఎఫ్ఏ రాంపురం రఫీక్ మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాలలో గట్ల దగ్గర, బావి దగ్గర నీటి వసతి కల చోట ఈ మొక్కలు నాటుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు


నలుగురి పిల్లలకు 'తల్లికి వందనం' డబ్బులు పడ్డాయని సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లి


మురవణి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


గుడికల్లు గ్రామంలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, ఆయన విజనరీ వలన రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలు వారికి చేరుతుండటంతో వారు ఎంతో సంతోషంగా ఉన్నారనీ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. గ్రామంలో ఈరమ్మ, పద్మావతమ్మ తల్లులు తమ పిల్లలు నలుగురికి 'తల్లికి వందనం' కింద డబ్బులు రూ.52వేలు అకౌంటులో జమ అయ్యాయనీ, గత వైసీపీ లో ఒక్క ఏడాది కూడా అమ్మఒడి డబ్బులు పడలేదని, ప్రస్తుత ప్రభుత్వం తమకు ఎంతో మేలు చేసిందని రాఘవేంద్రరెడ్డికి సంతోషంగా తెలిపారు. రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

పెద్దకడబూరు: కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయలకు అతీతంగా అర్హులైన అందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు సత్యన్న గౌడ్, శివ, జనార్ధన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మురవణి గ్రామంలోని 'తొలి అడుగు'ను కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేష్, చెన్నకేశవ, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: గుడికల్లు గ్రామాన్ని ఘనంగా అభివృద్ధి చేసి చూపిస్తామని టీడీపీ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి దేవదాసు అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధిని చేసి చూపుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదన్న, రాజేష్, ఆదాము, సత్యరాజు, యేసేపు, దావీదు, కొండన్నగౌడ్ పాల్గొన్నారు.